శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక.

కాకినాడ.

రెండునెలలకొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము. ౨౭ } బహుధాన్యనామసంవత్సరము. శ్రావణభాద్రపదమాసములు. { సంచిక 3

పాఠకులకు మనవి.

ఇప్పటికి బహుధాన్యసంవత్సరము (౨౭ వ సంపుటము)లో మూఁడు సంచికలు వెలువడినవి. చందాదారులు తాము పంపవలసిన చందాలను బంపి పరిషత్తునకుఁ దోడ్పడుదురని విశ్వసించుచున్నాము. పత్రికా ముద్రణమునకు వలయు కాగితము సకాలములో దొరకకపోవుటచే నీ సంచికలను ముద్రించుటలో నాలస్యమగుచున్నది. అట్టి యాలస్య మేమియును లేక ముందుసంచికలు ప్రకటింపఁబడును.

కార్యదర్శులు.

సందేహము.

క్రొత్తపల్లి సూర్యరావు, కాకినాడ.

ఈనడుమ నన్నయభట్టారకవిలాసములో సభ్యసమావేశ మైనది. అందులో భారతము మొకటి మూఁడు పర్వములును దీక్షగాఁ జదువుట సభ్యులకొక్క యుత్సాహకార్యము గావున నాదిపర్వమును బఠించుదుమం డిరి. ఈసభ్యుల నియమములు మున్నగునవి పలువురు జనవాణి మొదలగు పత్రికలలోఁ జదివియే యుందురు. పలువురు పలుతావులఁ జదువుచున్న సందర్భములో దీక్షగాఁ జదువుచుండుటచే సందేహములు కొన్నికొన్ని గలుగుచువచ్చినవి. వాని నాసభలో నందఱు నొక్కచోఁ జేరి చర్చించిరి. దాని సారాంశ మీక్రింద నిచ్చుచున్నాఁడను.

"సీ. తాలాభ మగువిల్లు దాల్చి విరోధుల
నెగుచుచు నున్నవాఁ డింద్రతనయుఁ
డాతని కెలన మహోన్మత్తహస్తుఁడై
యున్నవీరుండు వృకోదరుండు
యంత్రంబు నరుఁ జేసినవ్వాఁడు పోయిన
యాగౌరవర్ణుండు యమలనూజుఁ
డాతనిలోడన యరిగిన యిరువురుఁ
గవలవా రర్కప్రకాశతేజు
లనిన లక్కయింట నగ్నిదాహంబున
నెట్లు బ్రదికి రొక్కొ యిమ్మహాత్ము
లెట్టి పుణ్యదినమొ యేవురఁ జూచితి
మనుచు సంతసిల్లె హలధరుండు." 7 ఆ. 195 ప.

అనుదాని నొకరెత్తుకొనిరి.

"వ. అయ్యవసరంబున ధర్మనందనుండు నకులసహదేవానుగమ్యమానుం
డై నిజనివాసంబునకుం జనియె నిట ధృష్టద్యుమ్న సహితుండయి
యజ్ఞసేనుండు మహాసేనతో నర్జునునకు సహాయుండయి నిలిచె."

అని యొకరు చదివి (7ఆ.187) చూపిరి.

చ. అని మొన నట్లు దాఁకినమహారథులన్ ధృతరాష్ట్రరాజనం
　దనుల బలాఢ్యులన్ దళితదర్పులఁ జేసినవారు ధర్మనం
　దనయము లుగ్రవీరు లని తద్విధమంతయు నేర్పడంగఁ జె
　ప్పినవిని కౌరవప్రభుఁడు పెల్లుఱి తిద్దయు దుఃఖితాత్ముఁడై. ఆ. 8. 11.

అనుపద్య మింకొక్కరు గనఁబఱిచిరి.

సాధారణముగా నీవిలాససభ్యులు కవిత్రయమువారి భారతము లోని పదములు ప్రయోగములు వర్ణములు నిట్టి వానినే గణించువారు గాని కథలలోని పూర్వాపరసందర్భాసందర్భములను విచారించువారు కారు. కాని యానాఁడు కొంత చర్చ జరిపిరి.

యంత్రంబు సరుఁ డేసినప్పుడు ధర్మతనయుఁడు నకులసహదేవాను గమ్యమానుఁడై నిజనివాసంబునకుఁ జనియెఁగదా "ధృతరాష్ట్రరాజనం దనులను బలాఢ్యులను దళితదర్పులను జేసినవారు ధర్మనందనయము లెట్లయిరి. నాలుగైదు ముద్రణములలోని భారతపాఠములఁదీసి చదివిరి. అన్నియు నిట్లే యున్నవి. కాని చదలువాడ సుందరరామశాస్త్రిగారును దండిగుంట సూర్యనారాయణశాస్త్రిగారును—టీకాతాత్పర్యములతోఁ బ్రచురించిన యాదిపర్వములోమాత్ర మొక్కింత చర్చించిరి:—8వ యా శ్వాసము 11వ పద్యము తాత్పర్యములో "ధర్మరాజు నకులసహదేవుల తోఁగూడ యుద్ధమునకు ముందే నివాసమునకుఁ బోయినట్లు సప్తమా శ్వాసము 187 వచనమునందుఁ జెప్పఁబడినది. ఇట నేతత్పద్యార్థము దానికి విరుద్ధముగాఁ గనఁబడుచున్నది. కావున అట నివాసం బనఁగా స్వయంవరస్థానమున వారు పూర్వ ముండిన స్థల మని యర్థము చెప్పి విరోధపరిహారము చేయవలెను. మత్స్యయంత్రము తెగనేసినప్పుడు కలి గిన సంరంభమునఁ దమతమస్థలముల విడిచి పోయి యుండి మరల నా చోటికి వచ్చి యుండవచ్చును. యుద్ధప్రసంగంబున ధర్మరాజు నకులసహదే వులు యుద్ధము చేసినట్లు వర్ణింపకుండుట సంక్షేపార్థమై యుండవచ్చును" అని లిఖించిరి. ఇది సభ్యులకు రుచింపలేదు.

సంస్కృతములో నేమున్నదో యని చూడఁబోయిరి. వీరిఁద నట్లు వ్రాసినవారు మూలము చూడకుండఁగనే తమ యభిప్రాయము నిచ్చి యుందు రని తలంచిరి. శ్రీ వావిళ్లవారు నూతనముగా నచ్చువేయించిన దక్షిణదేశపాఠప్రతినిజూచిరి. స్వయంవరపర్వములో ౧౮౩ వ అధ్యాయ ముకడ ౫౦-౫౧ శ్లోకములలో—

"తం వృక్ష మాదాయ రిపుప్రమాథీ దణ్డీవ దణ్డం పితృరాజ ఉగ్రమ్
తస్థౌ సమీపే పురుషర్షభస్య పార్థస్య పార్థః పృథుదీర్ఘబాహుః
తదన్తరే ధర్మరతో౽పిగత్వా విజ్ఞాయ కున్తీం కుశలీం క్షణేన
ఆగమ్య తస్థౌ సహసోదరాభ్యాం పురుషర్షభాభ్యాం పురుషప్రవీరః"

అని యున్నది.

పూనాలో భండార్కరుసంఘము వారు సుక్తంకరుమహాపండితుని సాయమునఁ బ్రకటించిన యుత్తరదేశపాఠభారతములోఁ జూడఁగా ద్రౌపదీస్వయంవరపర్వములో ననేక భేదములు కనఁబడినవి.

౧౮౯ అధ్యాయము ౧౬ శ్లోకము.

"తస్మింస్తు శబ్దే మహతి ప్రవృత్తే యుధిష్ఠిరో ధర్మభృతాం వరిష్ఠః
ఆవాస మేవో పజగామ శీఘ్రం సార్థం యమాభ్యాం పురుషోత్తమాభ్యామ్"- అని యున్నది.

శ్రీ వావిళ్లవారిప్రతిలో 'విజ్ఞాయ కున్తీం కుశలీం క్షణేన ఆగమ్య' అన్నమాటలు పూనాగ్రంథములో నధోజ్ఞాపికలోఁ గూడఁ గనఁబడవు. పూనాప్రతిలో ధర్మరాజు మరలవచ్చినట్లు లేదు. తెనుఁగర్థము వ్రాసిన వారు చెప్పినట్లు "స్వయంవరస్థానమున వారు పూర్వముండిన స్థలమని యర్థము చెప్పుకొనుటకు వీలుకనఁబడదు. తల్లియొద్దకే వెళ్లినట్లు తలంప వలయును.

"అట్టి యవసరంబునఁ దల్లియొద్దకు ధర్మరాజును గవలవారును మున్నవచ్చియున్నఁ దదనంతరంబ భీమార్జునులు ద్రౌపదీసహితులై చను దెంచి" అని 7 వ ఆ. 210 వచనము నన్నయభట్టారకుని దొకటి పిడుగు లాగునఁ గనఁబడుచున్నది. దీనిగతి యేమి !

వ్యావహారికాంధ్రులయసంగత ప్రసంగములు.

(గ్రాంథికాంధ్రము మృత మైనదా?)

విమర్శకాగ్రేసరాది బిరుదాంకితు లగు
— బ్రహ్మశ్రీ కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు, కాకినాడ —

శ్రీమంతం బగు భరతఖండంబున సంస్కృతం బాద్యం బై, యనంతం బై, యఖండం బై, యద్భుతం బై వెలుంగుచుండఁ దత్సంస్కృత భాష యండఁగాఁ గలిగి యాంధ్రభాష యభివృద్ధినొంది శోభించుచున్నయది. అది బహువిశేషములు గలిగి విరాజిల్లుచున్నది. ఇప్పుడు వ్యావహారికాంధ్రుల మని పేరుఁ గొనిన యొకనూతనసంఘమువారు బయలువెడలి గ్రాంథికాంధ్రమునుగూర్చి విచిత్రప్రసంగములు గావించుచున్నారు. సత్యము తేలఁ గలందులకై దానిని గూర్చి ముచ్చటించుకొందము.

"వినఁదగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపఁదగున్
కని కల్ల నిజము దెలిసిన
మనుజుఁడె పో నీతిపరుఁడు మహిలో సుమతీ"

అని ప్రాజ్ఞులు చెప్పినరు.

ఆంధ్రము గ్రాంథికాంధ్ర మనియు, వ్యావహారికాంధ్ర మనియు, రెండువిధము లనియు, వానిలో గ్రాంథికాంధ్రము మృత మైపోయిన దని వ్రాయుటకును, సమన్వయించుటకును వ్యావహారికాంధ్రులలోఁ బ్రథమగణ్యు లగు రావుసాహేబు గిడుగు రామమూర్తిపంతులుగారు సాహసించుచున్నారు. కాని యెప్పుడు మృత మైనదో యెచ్చటను జెప్ప లేదు. అసలీగ్రాంథికాంధ్ర మెప్పుడు జనన మొందినదో తెలుపలేదు. కాన ముందుగా సాధ్యమైనంతవఱకు దానిఁ గనుఁగొందము.

నన్నయభట్టారకవిలాసము వారు వారిబుద్ధికిఁ దోఁచినట్లు చర్చించుకొని, కథ యేమైపోయినను సరియేగాని నన్నయభట్టుగారు వ్రాసిన భారతములోఁ బ్రసక్తభాగమున నేమైన వాక్యములు పద్యములు నిటీవలఁ బ్రతులు వ్రాసికొనినవారి ప్రమాదమున లోపించినవేమో యనికొనిరి. కొందఱు చెప్పినట్లు అనుశాసనికపర్వము ప్రక్షిప్తమే కానిండు, కొందఱనునట్లు సౌతిచెప్పినదగ్గఱనుండియే భారతమూలము కానిండు మాకిబ్బంది లేదు, నన్నయభట్టారకుని వాక్యములు లోపించిన మాత్రము సహించి యూరకుండ లేమని వారు చెప్పినారు

'మాత్రాలాభో పుత్రలాభః' అన్నట్లు నన్నయభట్టారకుని ప్రతియొక్కపదమును బంగారమువలెఁ జూచుకొందురు.

ఇపుడిపుడు పలువురు భారతపాఠములలో "అయ్యెడమని" "నీవు విదపఁడిగుడు" "కానతరణ" మొదలగునవి మాపుస్తకములో నిట్లున్నవి, మాపుస్తకములో నిట్లున్న వని తెల్పుచున్నారు. అట్లే యేమహాత్ములప్రతిలోనైన నీలోపములు సవరింపఁబడినవేమో తెలిసికొందమని యుబలాటపడుచున్నారు. విజ్ఞులీవిషయమును జర్చించి తెల్పఁబ్రార్థించుచున్నారు.

నన్నయభట్టారకుని వాక్యములు కాలగర్భములో నడఁగి పోయినవేమో యనుభయముచేతనే గాని మూలభారతసందర్భాసందర్భములను దెలుపుటకుఁ గాని పండితులను బరీక్షించుటకుఁ గాని యీసందేహములను దీర్పుఁడని కోరుట లేదని భాషాభిమానులూహింతురుగాక.

వ్యావహారికాంధ్రులయసంగత ప్రసంగములు.

(గ్రాంథికాంధ్రము మృత మైనదా?)

విమర్శకాగ్రేసరాది బిరుదాంకితు లగు

— బ్రహ్మశ్రీ కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు, కాకినాడ —

శ్రీమంతం బగు భరతఖండంబున సంస్కృతం బాద్యం బై, యనంతం బై, యఖండం బై, యద్భుతం బై వెలుంగుచుండఁ దత్సంస్కృత భాష యండగాఁ గలిగి యాంధ్రభాష యభివృద్ధినొంది శోభించుచున్న యది. అది బహువిశేషములు గలిగి విరాజిల్లుచున్నది. ఇప్పుడు వ్యావహారికాంధ్రుల మని పేరుఁ గొనిన యొకనూతనసంఘమువారు బయలువెడలి గ్రాంథికాంధ్రమును గూర్చి విచిత్రప్రసంగములు గావించుచున్నారు. సత్యము తేలఁ గలందులకై దానిని గూర్చి ముచ్చటించుకొందము.

"వినఁదగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపఁదగున్
కని కల్ల నిజము దెలిసిన
మనుజుఁడె పో నీతిపరుఁడు మహిలో సుమతీ"

అని ప్రాజ్ఞులు చెప్పుదురు.

ఆంధ్రము గ్రాంథికాంధ్ర మనియు, వ్యావహారికాంధ్ర మనియు, రెండువిధము లనియు, వానిలో గ్రాంథికాంధ్రము మృత మైపోయిన దని వ్రాయుటకును, సమన్వయించుటకును వ్యావహారికాంధ్రులలోఁ బ్రథమగణ్యు లగు రావుసాహేబు గిడుగు రామమూర్తిపంతులుగారు సాహసించుచున్నారు. కాని యెప్పుడు మృత మైనదో యెచ్చటను జెప్పలేదు. అసలీగ్రాంథికాంధ్ర మెప్పుడు జనన మొందినదో తెలుపలేదు. కాన ముందుగా సాధ్యమైనంతవఱకు దానిఁ గనుఁగొందము.

గ్రాంథికాంధ్రముయొక్క పుట్టుకను గూర్చి "దేశభాషలందుఁ దెలుఁగు లెస్స" యని నుడివియున్న కృష్ణదేవరాయలవారికి సమీపకాలమందున్న రామరాజభూషణునిచేఁ దనవసుచరిత్ర యం దిట్లు తెల్పఁబడియున్నది.

మ. మహిమున్ వాగనుశాసనుండు సృజియింపం గుండలీంద్రుండు త
న్మహనీయస్థితిమూల మై నిలువ శ్రీనాథుండు ప్రోవ న్మహా
మహులై సోముఁడు భాస్కరుండు వెలయింప న్సొంపువాటించు నీ
బహుళాంధ్రోక్తిమయప్రపంచమునఁ దత్ప్రాగల్భ్య మూహించెదన్.

దీనిని బట్టి నన్నయభట్టారకుని నాఁ డిది సంభవ మైనట్లుగాఁ దేలుచున్నది. మఱియు మిక్కిలి పురాతనకవియే యగు నన్నిచోళమహారాజుకూడ దీనిసంభవమును గూర్చి కుమారసంభవములో నిట్లు వ్రాసెను.

"మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెలుం
గున నిల్పి రాంధ్రవిషయం
బునఁ జనఁ జాళుక్యరాజు ము న్నగుపలువుర్."

దీనిని బట్టి చూచిన రాజరాజనరేంద్రునికాలమున—అనఁగా నన్నయభట్టుకాలముననే గ్రంథరచన ప్రారంభ మైన దని తేలుచున్నది. ఇట్లాంధ్రము జన్మించినకాలము మనకు బోధపడుచున్నది. ఇఁక నెప్పుడు మృతి పొందినదో తెలియదు. రామమూర్తిపంతులుగారును నది తెల్పలేదు. మనసారస్వతముం గన నది మృతినొందినట్లు కాన్పించదు. నన్నయనాఁడు బయలువెడలి యది బహువిధశాఖల విరాజిల్లుచుఁ గ్రమక్రమముగాఁ బెరుఁగుచున్నది. నాఁటినుండియు బహుపురాణములు, ఇతిహాసములుఁ, ప్రబంధములు, వచనములుఁ, గాద్యములు, పదకావ్యములు, ద్విపద కావ్యములు, యక్షగానంబులు, దండకములుఁ, గళికోత్కళికలు, శతకములు, నాటకములు, నీమున్నగునవి బహువిపులముగా బయలువెడలుచున్నవి. శ్రీ రామమూర్తిపంతులుగారు తాము బయలుదేఱినతరువాత గ్రాంథిక భాష మృతిపొంది తీరవలయు నని దృఢసంకల్పము చేసికొని నిద్రపోయి

యాత్రలలో వచ్చినకలలో గ్రాంథికాంధ్రము మృతిఁబొంది పోయినట్లు పెద్దస్వప్నముఁ గాంచి రేమో! అట్లు చెప్పుటకును వల్లకాదు. ఏమన వీరిలేరువాతఁ గూడఁ గళాప్రపూర్ణేత్యాది బిరుదాంకితు లగు బ్రహ్మశ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి శ్రీకృష్ణభారతము, వావిలికొలను సుబ్బారావుగారియొక్కయు బ్ర శ్రీ. జనమంచి శేషాద్రిశర్మగారియొక్కయు శ్రీమద్రామాయణములు, నింకనువందలకొలఁది నూతనగ్రంథములును, అనంతపంతుల రామలింగస్వామిగారి శుక్లపక్షము, శ్రీ జయంతి రామయ్యపంతులుగారి ఉత్తరరామచరిత్రము, మాసోదరుఁడగు సాహిత్యవిశారదసుబ్బయ్యశాస్త్రియొక్క సాహిత్యాకళ మఱియు నిట్టిగ్రంథరాజము లనేకములును బయలుదేఱుట మనరామమూర్తిపంతులుగారిమనస్సునకు వెకటుగానున్నను గ్రాంథికాంధ్రము మృతిపొందిన దని వ్రాయుట లోకమును మోసపుచ్చుటకై వ్రాసినమోసపువ్రాఁత యని స్పష్టమగుచున్నది.

శ్రీ శ్రీ శ్రీ జయపుర మహారాజావారును శ్రీ శ్రీ శ్రీ పీఠికాపుర మహారాజావారును మఱియు శ్రీమంతు లగుపలువురు సంస్థానాధిపతులును బండితప్రకాండులును దీని నభివృద్ధిఁగావింప విశేషప్రయత్నములు దేశమునం దంతటను గావించుచుండ దీనికిఁ జ్యుతి కలుగు టెట్లు? వెఱ్ఱిసంకల్పములు తమమనస్సులోఁ దాము పెట్టుకొని తమలోఁ దాము సంతసించుచున్నారు మనరావు సాహేబు గిడుగు రామమూర్తిపంతులుగారు.

అరవము, తెలుఁగు, కన్నడము, మళయాళము మున్నగునవి సోదరదేశభాషలై యుండఁగా నందులో నొక్క తెలుంగునకుమాత్ర మీనాశము కలుగనేల ?

ఇది యంతయు మన శ్రీ రామమూర్తిపంతులుగారియొక్కయు వారిశిష్యులయొక్కయు గారడీ కాని వేఱు కాదు. ఇందుల కెవరును జంకఁ బనిలేదు. రామమూర్తిపంతులుగారిశిష్యులు కొందఱు గ్రాంథికాంధ్రము మృత మాయె ననుసంగతి కల్ల గాని నిజము కా దని చాటుచున్నారు.

సత్యమేవ జయతి—నానృతమ్

ఆంధ్రవాఙ్మయమునకు వ్యక్తిత్వము లేదా?

(2)

— రామడుగుల వేంకటసుబ్బారావుగారు, విజయనగరము. —

పదమధ్యయతులు నన్నయభాగమున లేవనిరి. చూడుఁడు:—

"సాత్యవతేయవిష్ణుపదసంభవమై విబుధేశ్వరాబ్ధిసం
గత్యకశోభితంబయి జగద్విదితం బగుభారతీయభా
రస్యమరావగాఘము నిరంతరసంతతపుణ్యసాకను
స్నత్యభివృద్ధిసేయు వినినం గొనియాడిన నెల్లవారికిన్."

ఇట్లు పదమధ్యయతులు నన్నయభాగమునందుఁ బెక్కు లగపడుచుండ లేవని పల్కుట యనాలోచితమని చెప్పవలసియున్నది. సంస్కృతమునఁ బదమధ్యయతి వేసినచో నది యొకదోషముగాఁ బరిగణింతురు, కాని, తెలుఁగున నది శోభాదాయక మందురు.

ఆంధ్రభాషకు భాషాశాస్త్రసంప్రదాయము నెఱుంగక, వ్యక్తిత్వవిమర్శ చేయఁబూనుట నాఁగలిలేక వ్యవసాయము చేయుటవంటిదే. వారియుక్తన్యాసములో గ్రుక్క త్రిప్పుకొనకుండఁ గావ్యము లేమి, నాటకములు, అలంకారములు, ఛందస్సులు, గిందస్సులు, సమాసములు, పదములు, తుదకు "ఫుల్‌స్టాపులు" గూడ వచ్చి చేరవలె ననుచున్నారు. పదములు చేర సమాసములు చేరిన వనుటేల! వాఙ్మయములో ననేకగ్రంథములు తెనిఁగింపఁబడినప్పుడిన్ని యనుకొన నవసరము లేదు. సమస్తము నందుండియే వచ్చినచోఁ, జిగురుఁగేలు, జంటిమోవి, యనువానిమాట యేమందురు? "సంస్కృతలక్షణంబు దొడరని సమాసంబులుం గల" యను సూరిగారి పంక్తులు శ్రీవారు చూడలేదనుటెట్లు? ఆ సంప్రదాయము లన్నియు వచ్చినఁ దెలుఁగులోఁ బ్రత్యయరహితముగా విశేషణవిశేష్యభావము చూపింపఁగలరా? "రామాయ రామభద్రాయ" అనునట్లు తెలుఁగులో రామునికొఱకు రామభద్రునికొఱకు నమస్కార మనుట

విరసముగా నుండును. ఇట్లే యనేకములు భాషాశాస్త్రజ్ఞులకుఁ దెల్లమగుచుండును.

నన్నయకాలమునాఁటికి శుద్ధదేశీయపదములు 4 వేలకుఁ బైఁగా నున్నట్లు కవిత్వవేదిగారు వ్రాసియున్నారు. కనుక నాపదములతో దేశీయ భాషలోఁ గావ్యము సులువుగా రచింపవచ్చును. కాని నన్నయాదులు దేశీయభాషలోఁ గావ్యములను రచింపక తత్సమపదములతో రచించుటకుఁ గారణ మేమను సంశయము పొడమవచ్చును. ఆకాలమున సంస్కృతభాష చాల విరివిగాఁ బ్రచారములో నున్నది. పండితాదరణలో నున్నది. కాన, పండితాదరణమును, మెప్పును బొందవలె ననునుద్దేశముతోను, దనసంస్కృతభాషాపాండిత్య ప్రకటనార్థమును, నన్నయ తత్సమపదముల నెక్కుడుగా భారతభాగములో వాడియున్నాఁడు, కాని, యాంధ్రభాషలో దేశీయపదములు తగినన్ని దొరకకను దేశీయభాషలోఁ దాను గావ్యరచన చేయుట కసమర్థుఁడునై తత్సమపదములను వాడి యుండలేదు. కావున నన్నయకాలమున కుండు నాంధ్రభాషలోని యన్య దేశ్యపదములు తీసివేసినను, దేశికావ్యము రచించుటకుఁ దగినంత దేశీయ పదసామగ్రి యాకాలమున లేకపోలేదు.

బ్రహ్మశ్రీ ఆకొండి వేంకటశాస్త్రిగారు సమస్తము సంస్కృతము నుండి తెలుఁగులోనికి వచ్చినట్లు వ్రాసి రని నుడివిరి. వారివ్యాసమునందలి కొన్నివాక్యముల నీక్రింద నుదాహరించుచున్నాను. వానినిబట్టి, శ్రీ వేంకటశాస్త్రిగారే యట్లన్నారో, లేక ప్రతివాదకులే యట్లు దురభిప్రాయపడినారో ప్రాజ్ఞ లూహింతురుగాక. "ద్రావిడభాషలలో నసంఖ్యములగుసంస్కృతప్రాకృత సమపదములును దద్భవపదములు నగుపడుచుండుటచేతను ఆంధ్రవ్యాకరణపురీతులు, సంస్కృతప్రాకృతవ్యాకరణమార్గములే యయి యుండుటచేతను ఆంధ్రభాష సంస్కృతప్రాకృతముల పరిణామ మను నసంగతాభిప్రాయము స్ఫురించుట కవకాశ మొదవె ననితోఁచుచున్నది. ప్రాచీను లగునాంధ్రవైయాకరణు లెవరును, నాంధ్రభాష

సాకల్యముగా, సంస్కృతప్రాకృతములనుండి పుట్టిన దని చెప్పియుండ లేదు. ఆంధ్రభాషలోని తత్సమ తద్భవ పదములు సంస్కృతప్రాకృతజన్యము లని మాత్రము చెప్పియున్నారు ''

“వ్యాసభారతమున—దుష్యంతోపాఖ్యానము తరువాత యయాతి చరిత్రమున్నది. ఆంధ్రభారతమున నట్లు గాక, యయాతిచరిత్రము ముందు, దుష్యంతోపాఖ్యానము తరువాత, బ్రాహ్మణాసురకన్యాజాతసంతతిప్రకాశనపూర్వకము గౌరవవంశీయుల యాభిజాత్యమును విశదీకరించుటకై నిర్వచింపఁబడినవి. పరీక్షిన్మరణోత్తరమున, జనమేజయరాజ్యాభిషేకసందర్భమున “తతో నృపే తక్షణతేజసా హతే'' నృపం శిశుం తస్యసుతం ప్రచక్రిరే'' “స బాల ఏ వార్యమతి ర్నృపోత్తమః” అనుమూఁడుశ్లోకములును సౌతి చెప్పినట్లుండ మరల 49వ అధ్యాయములో జనమేజయుఁ డడుగఁగా మంత్రులు పరీక్షిచ్చరితము చెప్పినట్లు సంస్కృతభారతములో నున్నది. ఈరెంటిని గలిపి చెప్పిన కథనే మరలఁ జెప్పనవసరము లేకుండ మంత్రులొక్కరే చెప్పిన ట్లాంధ్రభారతమున నున్నది. మూలమున, కీచకుఁ డర్ధరాత్రమునఁ జంపఁబడఁగా నుపకీచకులు మొదలగువా రందఱుఁ దెల్లవాఱినపిదప వచ్చిచూచి యాతనికి దహనసంస్కారము చేయఁ దలఁచి, ద్రౌపదిని గూడ, వానితోఁ దుద ముట్టింప నీడ్చుకొని పోయి రనియు, నాప్రాతఃకాలసమయముననె, భీముఁ డుపకీచకులను వధ గావించె ననియు, నుండఁగా, నియ్యది సంగతముగా నుండుటచే, నుపకీచకుల వధయుఁదెల్లవాఱుటకుఁబూర్వమే చీకటిలోనే గావించిన ట్లాంధ్రభారతమున మార్పు గావింపఁబడి మూలమునకు వన్నె పెట్టుచున్న ట్లున్నది. కీచకుఁడు ద్రౌపది సౌందర్యమును జూచి యాశ్చర్యపడుచుఁ దద్వర్ణనావసరమున నతిశయోక్తులతోఁ గూడిన భాగముల నుత్ప్రేక్షోపమాద్యలంకారాములతోఁ గూర్చి, సమాంతరము లగువాక్యరచన గలపద్యములతోను మూలమున లేని యాంతరంగికశృంగారభావాతిశయములతోను మూలమును బెంచిన ట్లున్నదాంధ్రభారతము.

ఒకచో నీభాషాంతరీకర్తలు, మూలములోని కథాంశములను వెనుకనున్నదానిని ముందు, ముందున్నదానిని వెనుకగా గ్రహించి కథావస్తువునం దైక్యగుణము సంపాదించుచును మూలమునందలి నీరసఘట్టముల నతిరమ్యములుగాఁ బ్రదర్శించుచు నమన నతికిన భావగర్భితము లగు పదముల చేతను నాకారవర్ణనల చేత నొకదృశ్యమును మనకన్నులయెదుటనడచుచున్నదానినిగాఁ జేయుచును, ఆయాకథాపురుషుల మనోవృత్తులను, భావవైఖరులను వర్ణించుచుఁ బాత్రౌచిత్యమును బాటించి యాకారేంగితాదులను సూచించుచు మూలమునందలి పాత్రలను నూతనజీవముతోఁ బ్రకాశించునట్లు ప్రదర్శించుచును, సందర్భానుసారముగా నూతనము లగుప్రకృతివర్ణనలను జేర్చుచును, మూలమునకు మెఱుఁగు వెట్టుదురు. ఇట్టి సూక్ష్మవిశేషములను, ప్రత్యేకవ్యక్తిత్వమును దెలిసికొనుటకు మూలముతో సరిపోల్చి చూడవలసియుండుటచేతను, గ్రంథవిస్తరభీతిచేతను బైని నాల్గుదాహరణములు మాత్రమే చూపితిని. ఆంధ్రవాఙ్మయమునకు వ్యక్తిత్వమున్న దనుట కాంధ్రమునుండి సంస్కృతములోనికిఁ బరివర్తితము లైనగ్రంథములును, నచ్చతెనుఁగు గ్రంథములును బ్రబలసాక్ష్యములే గదా! రఘునాథనాయకుఁడు రచించిన రామాయణమును మధురవాణి సంస్కృతములోనికిఁ బరివర్తించెను. వసుచరిత్రముకూడ సంస్కృతములోనికిఁ బరివర్తింపఁబడినది. కూచిమంచి తిమ్మనార్యుని యచ్చతెనుఁగుగ్రంథములుకూడ నిందులకు సాక్ష్యములే.

ఆంధ్రభాషాస్వరూపము పూర్తిగఁ దెలిసి యవగాహన చేసికొనియున్నవా రెవ్వరు నాంధ్రవాఙ్మయమునకు వ్యక్తిత్వము లేదని సకారణముగ నిరూపింపఁజాలరు. పక్షపాతదృష్టితోఁ గాక సమదృష్టితోఁ బరిశీలించినచో, నేను బైని నిరూపించినవానివలన, నాంధ్రవాఙ్మయమునకు సంపూర్ణమైన వ్యక్తిత్వము కల దని తెలియు నని నాయభిప్రాయము.

శ్రీరస్తు.

సుమతీశతకపద్యములు.

క. క్షితిఁ గానికూళఁ గుకవిని
సతి నమ్మి రహస్యవిధులు సలుపకు మెప్పుం
బతిలేని యింట నుండకు
మతివంతుల కిదియె నీతిమార్గము సుమతీ. ౧

క. పగవాఁడు తనకుఁ జిక్కినఁ
బగఁ జంపక మేలుచేసి పంపుట ధరలోఁ
బగవాని కదియె చంపుట
తగువనికి నిదియె నీతి తథ్యము సుమతీ. ౨

క. కుటిలునితో నొనఁ గూడకు
కటువగు సభలోన వెడలఁ బల్కకు మది దు
ర్ఘటమగు కార్యము చేయకు
నిటలాక్షుని పాదభక్తి నిలుపుము సుమతీ. ౩

క. వినయము కంఠాభరణము
ఘనమగుదానంబు నధికకరభూషణముల్
విను కర్ణాభరణంబుగ
వినవలె శివకథల నెపుడు వేడుక సుమతీ. ౪

క. కాదన్నవాఁడె కరణము
వాదడఁచినవాఁడె రెడ్డి వసుధేశుఁడున్
లే దన్నవాఁడె చనవరి
గాథలు చెప్పెడువాఁడె కావ్యుఁడు సుమతీ. ౫

క. ఇంపెఱుఁగని సతిఁ గోరుట
కంపలరనిపూవు ముడువఁ గైకొను టెల్లం
బెంపెఱుఁగని నృపుఁ గొల్చుట
సంపెంగకుఁ దుమ్మెదేఁగి చచ్చుట సుమతీ. ౬

క. నెనరుగలవాఁడె చుట్టము
తనమనసుకు వచ్చువాఁడె దాత ధరిత్రిన్
కనుమఱుఁగుకలదె యీఁడుది
తనవాఁ డొరులనెకుమాట తథ్యము సుమతీ. ౭

క. స్థితిలేక బల్మిచెల్లదు
స్థితిగల్గిన బల్మి లేక స్థితిచెల్లదు నా
స్థితియును బల్మియుఁ గల్గిన
నతనిది త్రైలోక్యపదవి యందురు సుమతీ. ౮

క. రిపుపొత్తుఁ బాముపొత్తును
గపటుండగు మిత్త్రుపొత్తు గడుసరిపొత్తుల్
విపరీతభార్యపొత్తును
నెపమున విడనాడకున్న నేరము సుమతీ. ౯

క. మాతంగము మదమెక్కిన
భూతలపతి జారుఁడైన భువి విద్వాంసుల్
పాతకులైనను సాగర
భూతంబులు చేసట్లు భువిలో సుమతీ. ౧౦

క. కనరానిది చల మైనను
వినరానిది గురులనింద వికలిమైనన్
అనరానిది తలిదండ్రుల
మనరా దవివేకితోడ మతమిది సుమతీ. ౧౧

క. తెరువున నేనుఁగుఁ బొడఁగని
మొరయించుక వెఱ్ఱికుక్క మొఱిఁగినభంగిన్
దొర నల్పుఁ డెఱుఁగ కాడిన
సరిసేయఁగవలదు వానిసహజము సుమతీ. ౧౨

క. తమకించిన నెపమెంచును
దమకించినఁ దల్లియైనఁ దనుఁజెఱఁ జూచున్
దమకింపఁ గార్యహానియుఁ
దమకించినఁ బ్రాణహాని తప్పదు సుమతీ. ౧౩

క. ఎన్నఁడుఁ గుడువక కట్టక
తన్నేమతి కూర్చుధనము ధరలో నెపుడున్
అన్నలకు రాజులకు మతి
కన్నములకుఁ బోవుచుండుఁ గదరా సుమతీ. ౧౪

క. చపలత లాభముఁ జెఱచును
నెపమునఁ బగవారిఁగూడి నేరములెంచున్
అపలాపించును నమ్మిక
కపటాత్ములతోడిపొందు గాదుర సుమతీ. ౧౫

క. హరినైన జిష్ణునైనను
సురపతిసుతునైనఁ జంద్రసూర్యులనైనన్
సురకాని వ్యయముసేయక
తరుణులు డాయంగనీరు తథ్యము సుమతీ. ౧౬

క. భూమీశుచిత్త మెఱుఁగక
ప్రేమముతో మనవిచెప్పఁ బెనఁగుటలెల్లం
బాముకు వాకట్టెఱుఁగక
సామునఁ జెయిచాఁచునట్టిచందము సుమతీ. ౧౭

క. నగజాతకు హరుమేనను
నగపాలొప్పించె మరుఁడు చచ్చెఁ బిదపం
బగసాధించనిమనుజుఁడు
మగవాఁడా! మగువగాక మహిలో సుమతీ. ౧౮

క. ఎడ్డెఁడు పతివలపెఱుఁగఁడు
జడ్డిలఁబడితిరుగువాఁడు జాణండగునా
యడ్డమునిడుపును దిరిగెడు
త్రెడ్డెఱుఁగునె పాల తీపిఁ దెల్లము సుమతీ. ౧౯

క. అరమాడ జీతమైనను
ధరణీశుఁడు తగవరైన దగ్గఱవచ్చున్
సురరాజ్య మిచ్చెనేనియుఁ
దరమెఱుఁగనిరాజుఁ గొల్వఁ దగదుర సుమతీ. ౨౦

క. బలువిద్య లెన్ని గలిగినఁ
గులవిద్యయె వన్నెఁ దెచ్చుఁ గొంకక ధరలో
విలువిద్య పరశురాముని
కులవిద్యయె? యెన్నిచూడికొనఁగా సుమతీ. ౨౧

క. దీపము మలిగినఁ జీకటి
యేపునఁ గానంగవచ్చి హెచ్చినపగిదిన్
శ్రీపోలఁతి వాసినప్పుడె
యాపద లావరునిమేన నలముర సుమతీ. ౨౨

క. పులినాకి విడుచు దైవము
గలకాలము; దైవరహితకాలం బైనం
గలుపించి గొఱ్ఱెఁ దినును
దలపోయఁగ దైవవశము తప్పను సుమతీ. ౨౩

క. తప్పునకుఁ దగినదండన
మప్పుడె సేయంగవలయు నవనీపతికిన్
నిప్పునను జీరఁ జుట్టిన
యప్పగిదినిఁ జేయవలయు నాతని సుమతీ. ౨౪

క. కలిమియె కులమున కధికము
కలిమియె బలవర్ధనంబు కలిమియె మిగులుం
గలిమియె యుక్తికి మూలము
కలిమియె సుఖకరము తలఁపఁగా నిల సుమతీ. ౨౫

క. సత్య మఖిలజనపూజ్యము
సత్యమె సురలోకసౌఖ్యసోపానం బౌ
సత్యమె నిశ్చల ధర్మము
సత్యమె భవహరము జయము సత్యమె సుమతీ. ౨౬

క. బలవంతుఁడె గుణవంతుఁడు
బలవంతున కాజ్ఞ చెల్లు బలవంతునకే
కలిమి గలవారె బంటులు
బలవంతుం డఖిలమునకు బలమగు సుమతీ. ౨౭

క. ఆయంబు వ్యయము మించిన
శ్రీయును సమమైన దళముచెడకుండు వ్యయం
బాయంబు మించె నేనియుఁ
బాయదు పేదఱిక మెన్ని భంగుల సుమతీ. ౨౮

క. గుప్తముసేయుము తంత్రము
సప్తోపాయములనైన శత్రుల గెలువన్
సప్తవ్యసనము లుడిగియు
నాప్తుల రక్షింపు చాలు నంతియె సుమతీ. ౨౯

క. రాఁగలభాగ్యము వచ్చినఁ
దాఁ గుడువక దాన మీక దాఁచుఁగ నేలా
పోఁగాలంబులు వచ్చిన
మాఁగిన కండ్లూడినట్లు మహిలో సుమతీ. 3౦

క. గాడిద మదకరి యగునే
బూడిద కర్పూరరజము పోలికి యగునే
మోడు విమానం బగునే
మూఢుఁడు గుణియగునె తలఁప మున్నుగ సుమతీ 3౧

క. ఇచ్చినదినములదాఁక నె
లచ్చికి నెనఁ బాయరాను లజ్జయువలె నే
యిచ్చినదినములు తీరిన
నిచ్చఁ దనుం బాసి లచ్చి యేఁగుర సుమతీ. 3౨

క. తనయుఁడు తండ్రికి బాలుఁడు
ఘనుఁ డాతఁడు తండ్రి లావుగలవాఁ డెల్లన్
జనకునిలో పుడిగిన మఱి
తనయునికిని దండ్రి శిశువు ధరఁగో సుమతీ. 33

క. రానిది కోరిన వచ్చునె
రానున్నది కోరకున్న రాకేలుండున్
దానెంత తమకపడినను
గానున్నది గాకపోదు గదరా సుమతీ. 3౪

16

క. అంజనసూనుఁడు దెచ్చిన
సంజీవికి సాటివచ్చు సకలార్థులకున్
రంజిల్ల నపుడువార్చిన
గంజిసుమీ ప్రాణరక్ష గదరా సుమతీ. ౩౫

క. దారిద్ర్యముకంటె మహా
దారుణ మగు పాతకములు తలఁప గలవే
చేరుదురు మృతిని నలువురుఁ
జేరనొకో దరిద్రు నొకఁడు సిద్ధము సుమతీ. ౩౬

క. అలుకు నెడ రొంపిఁ జల్లుట
కొలు చొల్లమిగాదు మిగులఁ గూర్చుటకొఱకే
వలయు నెడ నర్థమిచ్చుట
వెలయఁగ నభివృద్ధికొఱకె వినరా సుమతీ ౩౭

క. ఏడెన్నెలుఁగఁగవలయును
నేడెన్నఁడు విడువవలవ దేశున్ వినుమీ
యేశున్ మనమున నిలుపుము
యేడెన్నఁడు విశ్వసించు మెన్నఁగ సుమతీ. ౩౮

క. అనఘా విను ముద్యోగికి
ధనమొండెను గీర్తి యొండె ధన్యత యొండెం
బొనరంగ నిరుద్యోగికి
ధనకీర్తులు రెండు లేవు తథ్యము సుమతీ. ౩౯

క. మదిఁ బొడమిన దుఃఖమునకుఁ
జను వొండెతుఁ బ్రాయ మొండె సజ్జనగోష్ఠిం
బొదలుచు నొకపద మొండెను
బద నెఱిఁగిన చెల్మియొండెఁ బ్రాణము సుమతీ. ౪౦

క. ఆసించినప్పు డిచ్చిన
వీసము పదివేలుపోలు వెయివేలైనన్
వీసముగఁ జూచు మనుజుం
డాసల నడియాడ నీయ నర్థికి సుమతీ. ౪౧

క. ఒఱగొడ్డె పూరనుండకు
మఱుగలచుట్టంబు కలిమి కాసింపకు మిం
పెఱుఁగని హీనునిఁ గొల్వకు
మఱవక దుర్జనుల గోష్ఠి మానుము సుమతీ. ౪౨

క. భువి నీవి కొంచె మైనను
కువలయపతి సుగుణి యైనఁ గొల్వఁగవచ్చున్
యువరాజ్యపట్టమిచ్చిన
నవివేకిని గొల్చుటెల్ల నధమము సుమతీ. ౪౩

క. త్రాసును ధరలోఁ బడిచెను
పీసనబడి యొక్కరూపు వివరింపంగా
పీసంబైనను దిరముగ
నోసరముగ నొక్కవంక నొదుఁగుర సుమతీ. ౪౪

క. వలవని పల్లును మదిలోఁ
గలయని సతిపొందు రాజుగానని కొలువుం
బిలువని పేరంటంబును
దలఁపని చెలిమియును నెంచఁ దగదుర సుమతీ. ౪౫

క. ఘన మెఱుఁగనట్టి కోపలు
వినయము లేనట్టి సుతుఁడు వెఱవని యనుజుల్
అనుకూల గాని భార్యయు
మనుజునకును మంకు లేనిమరణము సుమతీ. ౪౬

క. తఱిమినఁ బాఱనిగుఱ్ఱముఁ
దర మెఱుఁగని రాజుకొలువు తరుణులమొసలా
దరిలీపు సేయు మోహము
గరగరగా విడువవలయుఁ గదరా సుమతీ. ౪౭

క. సుంకరికి బొంకు వలయును
అంకనకును దిరుగవలయు నవనీస్థలిలో
శంకుడిగి మిగుల మిడిసిన
వంకాయకుఁ జింతపండు వలెరా సుమతీ. ౪౮

క. సిరి తనకు వలచి వచ్చిన
సిరికిం దగు చిహ్నలెల్లఁ జేయఁగవలదా
సిరిగూర్చి ప్రాఁకఁ దలఁచిన
సిరికడపటఁ జేరు నదియు సిద్ధము సుమతీ. ౪౯

క. మొగసాల నొంటి నుండకు
పగచాటి జయించు దాఁకఁ బదరకు మదిలోఁ
దెగఁబాఱువాని నమ్మకు
పగగొనునాచోట నిల్వ వలదుర సుమతీ. ౫౦

ఇవి, అంద్రంగి గ్రామనివాసులు బొడ్డపాటి లక్ష్మీపతిగారిచే క్రీ శ. ౧౮౬3 సంవత్సరమున వ్రాసికొనఁబడిన తాళపత్ర సుమతిశతకపద్యము లనుండి శ్రీ దువ్వూరి పాపన్నగా రెత్తి వ్రాసి పంపినవి.

కొన్ని పద్యము లింకను గలవుగాని మృదువుతప్పియున్నవి. ప్రకటించిన వానిలోను గొన్ని సందేహములుగా నున్నవి.

అచ్చుపడిన పుస్తకములలో నివి కనఁబడవు.

వ్యాకరణశాస్త్ర ప్రశంస.

— శ్రీ. భా. ప్ర. మల్లాది సత్యనారాయణశాస్త్రిగారు, నూజివీడు —

వ్యాకరణశాస్త్ర మనఁగా నాయాపదముల కాయాయర్థము లెట్లు సరిపడినవో, యాయాపదములలో నాశాస్త్రజ్ఞులు పారిభాషికములుగ నేయేయవయవము లున్న వని యంగీకరించిరో యంతఁ బ్రకృతిప్రత్యయము లని వేఁకిఁ బేరులో వానిలో నొక్కొక్కదాని కెంతెంత యర్థమో సమిష్టివలనఁ గలుగునర్థ మెట్టిదో మొదలగునంశములను విమర్శించి నిర్ణయము చేయు నియమన మని యాపేరును బట్టి నిర్ణయింప నగును. (వ్యాకరణ=విశేషముగా (శబ్దములలో) నవయవులయు, నవయవములయు విభజనమును జేయు, శాస్త్రము=శాసనములు-అని వ్యుత్పత్తి)-ఈశాసన మిక్కడొకరు చేసినట్లు కానిపించుచున్నదే గాని విచారింప నది స్వతస్సిద్ధమే యని తేలఁగలదు.

లోకములోని పదార్థమును మనుష్యుఁడు తనయనుభవమునకుఁ దగిన ట్లుపయోగపఱచుట యరయుచున్నాము. కాని వాఁడాపదార్థములోని ప్రత్యంశమును దెలియఁజాలకున్నవాఁడు. పదార్థవిజ్ఞానశాస్త్రవేత్త మాత్ర మాపదార్థములో నెన్నియంశము లున్నవో యందేయంశ మెందుల కుపయోగపడునో మొదలగు నంశములను విమర్శించి యాకారణముచే నీవస్తువును జను లిట్టియుపయోగములో నుంచి రని నిర్ణయము చేయఁగలఁడు. సామాన్యమానవునకును శాస్త్రవేత్తకును గలభేద మిట్లే యనంతమై యున్నది. ఆశాస్త్రవేత్త కట్టివిజ్ఞానము మొదట లేకపోయినను విమర్శించుస్వభావముగలిగి విమర్శించుచుండుటచే నలవడుచున్నది. అట్టి యనుభూతవిషయవిమర్శకులు స్థూలదృష్టితోఁ జూచి కొంతజ్ఞానము సూక్ష్మదృష్టితోఁ జూచి కొంతజ్ఞానము నుపార్జించి విజ్ఞానవంతు లగుచున్నారు. ఇట్టి విజ్ఞాతలు చేయునుపదేశములవలనను స్వయముగా విమర్శించు స్వభావము గలవా రగుటవలనను క్రొత్తవిమర్శకులు లోఁతునకు బు

ద్ధిని జొరనిచ్చి యందలి క్రొత్తయంశములను వెల్లడిచేయును. ఇట్లు చేయుటచేత విజ్ఞానము నొక గ్రంథరూపమును దాల్చి శాస్త్రమను పేర వెలయుచున్నది.

ఆశాస్త్ర మభ్యసింపఁదలచినవాఁడు శాస్త్రజ్ఞుఁడు చెప్పు నంశములను దెలిసికొనలేక మాటిమాటికి విసుగుఁగొనుట విద్యార్థులతోఁ బరిచయము గల యాగురువులకు ననుభవగోచరమే. ఆవిధముగనే వ్యాకరణశాస్త్రముకూడ నభిప్రాయబోధకశబ్దప్రయోగములలోఁ బుట్టి యావిషయమెఱుఁగువాఁడు వచ్చుపర్యంత మణఁగియుండి యావిమర్శకునివలనఁ దలయెత్తి క్రమముగా శాఖోపశాఖల విరాజిల్లు మహావృక్షమువలెఁ బ్రకృతిప్రత్యయాద్యనంతవిశేషములు గలదై చూచువారికి భయంకరము నాశ్చర్యకరము నై యుండును. పదార్థవిజ్ఞానశాస్త్ర మట్లు లీవ్యాకరణశాస్త్రమును సామాన్యమానవుల కగోచరమే.

కనుక భాషతోడనే పుట్టి భాషతోడనే పెరిఁగి భాషతోడఁ గలసి మెలసి యున్న వ్యాకరణము క్రొత్తవిషయము గాదు. కనుకనే వైయాకరణు లఖండస్ఫోటవాదు లైరి.

ఆవ్యాకర్త యీశాస్త్రమును గనుఁగొననే కాని భాషకుఁ జేసిన మహాహాని యేమియును లేదు. శాస్త్రకర్తకు శాస్త్రరచనయందలి యుద్దేశ్యము సాధకుఁడు సులభముగా నావిషయమును గ్రహించియుండవలె ననియే గాని బాధపడవలె నని కాదు. అయిన నంతయధికవిషయమును సులభముగ గ్రహింపఁజేయవలె నను నుద్దేశ్యముతో నాశాస్త్ర మారంభించెను గానఁ గష్టముగా నుండకమానదు.

అనఁగా మానసికపరిశ్రమముకంటె శారీరకపరిశ్రమము కష్టమని తలఁచి మానసికపరిశ్రమముగఁ జెప్పఁబూనినయంశమును గొన్నిశబ్దములతోనే చెప్పఁదలంచినందునఁ గష్టమని యభిప్రాయము. అందును ప్రారంభమునఁ జెప్ప నలవికాని యంతకష్టము. వేయేల "కష్టం శాస్త్రమ్మ"ను సూత్రమే కలదు. ఆకష్టమునకుఁ దాళినవానిబుద్ధి కావిషయము మంతయు సులభమై పోవును.

కాన వాఁడు శబ్దస్వరూపనిర్ణయముఁ జక్కగాఁ జేయఁగలవాఁడగును. అదియే దానికి నుపయోగము. అంతగొప్పవిషయము నన్ని కొద్దిపదములతోఁ జెప్పఁబూనినయెడల నాశాస్త్రము వ్యర్థప్రయోజన మనవచ్చును. భాషనంతను బరిపూర్ణముగా నేర్చి యాయాప్రయోగవిశేషములను జక్కగాఁ బ్రయోగింప నభ్యసించినవారికి నీశాస్త్రమువలనఁ గలుగులాభ మేమి? అది సులభముగా సాధ్యము గాదనియే శాస్త్ర మనుదానివైపు చూపుచు బ్రసరింపఁజేయుట తటస్థించినది. ఇందులకనియే పతంజలిముని బృహస్పతియొద్ద నింద్రుఁడు శబ్దములనే కొన్ని వేలేండ్లు నేర్చెనని యితిహాసము నుపన్యసించెను. కనుక శాస్త్రము మహాప్రయోజనవంతమని తేలినది. అట్టిశాస్త్రము జనులవ్యవహారమునుండియే బయలుదేఱెను గాని పనిలేనివాఁడు కాలక్షేపమునకై నిర్మించి ప్రజలపై వేసినబ్రహ్మాస్త్రము గాదు. ఆశాస్త్రకర్త కేవలప్రకాశకుఁ డనియే కాని యుత్పాదకుఁడని నుడువరాదు. ఆశాస్త్రవేత్తలును శాస్త్రములును లేనిచో నాభాష వ్యవహారైకశరణ్య శబ్దస్వాత్మకమై యుండును, గాన, నప్పుడు ప్రయోక్తల యవయవలోపాదికమువలన వచ్చునుచ్చారణములు నానావిధములై యుండి క్రమముగా బలిసి బలిసి యొక యానుపూర్వి గలశబ్దము నైనను శీఘ్రముగా భిన్నానుపూర్వి గలశబ్దముగా మార్చుచుండును. అంతియే కాదు, పూర్వప్రయోగములు ముందుముందు కాలమునకు నప్పటివి తరువాతికాలమునకు నిలువక యెప్పటికప్పుడు క్రొత్తవియై యుండును, గాన, నాభాష చిరకాలముక్రిందట నుత్పన్నమైనను వెదకికొనఁ దగినశబ్దములు గలదై పోవును. ఆభాష యేదైన గ్రంథరూపమున నున్నచో శాశ్వతముగా నిలుచును గాని కాలము గడచినకొలఁదిఁ దద్వేత్తలు దుర్లభులు గాన నందలిచందములు వర్ణములును దెలియఁబడవు. కనుకనే ఋగ్వేదభాష కౌత్సాదులకుఁ దెలియకుండుట తటస్థించినది.

శాస్త్రవేత్తలున్నచో నాయాప్రయోగముల నన్నింటిని గొన్ని సూత్రములచేతనే గుదిగ్రుచ్చి యుండుట, వానికి విపులముగ వ్యాఖ్యానము వ్రాయుట వాని ననుసరించి కొన్నికావ్యాదిగ్రంథములఁ జేయుట మొద

లగునవి వారివని గావునఁ బూర్వప్రయోగములు ఖిలములు గాక తెలియఁబడునర్థములు గలవై యుండును. అదియే శాస్త్రమునకు వినియోగము. ఆకారణముచే భాష వృద్ధి యగును గాని క్షీణింపదు. కేవలవ్యవహారమునకు నివి యన్నియు నక్కఱలేదు. కావున నీప్రయోగవిశేషముల నెఱిఁగి ప్రయోగించినవారు గ్రాంథికులును, పెఱలు వ్యావహారికులు నగుదురు. ఇట్లు గ్రాంథికవ్యావహారికత్వరూపవ్యవహారభేదము ప్రాదుర్భవించి బలియుచుండును. క్రమముగా నాభేదము బలిసి యాగ్రాంథికవ్యావహారికభాషల నొకదానికొకటి చూపుమేరదూరమున నున్నట్లు చేయును. అయినను గ్రాంథికవ్యావహారికు లొక్కచోట నున్నందునను వ్యవహారము ప్రబలమైనదగుటచేతను గ్రాంథికులకుఁ గూడ నప్పుడప్పుడు వ్యవహారదుష్టపదములు భాషలోఁ దొరలకపోవు, గ్రంథములలోఁ జొరకను బోవు. అదికారణముగా శాస్త్రము వ్యర్థప్రయోజన మనవచ్చునా ?

ఏవ్యావహారికభాషయు నైన నేకో యొకకట్టుపాటు స్వతస్సిద్ధమై యుండనే యుండును. ఆకట్టుపాటు లేనిచో నాభాష యర్థమగుట యెట్లు? కొంతకాలమునకు దానికిఁగూడఁ బ్రకాశకుఁడు బయలుదేఱనే తేఱును. ఏగ్రాంథికభాషయైన మొదట వ్యావహారికభాషగానే యుండియుండును. ఇప్పటి వ్యావహారికభాషకువలెనే (త్రిలింగభాషకువలెనే) యప్పటివ్యావహారికభాషలకుఁ (వైదికలౌకికసంస్కృతభాషలకు) గూడ మొదట వ్యాకరణనియమములు వ్రాయఁబడి యుండనే యుండవు. కనుకనే కౌత్సుఁడనుఋషి వేదమున కర్థము లేదనియు దానివిమర్శనము వృథాప్రయోజన మనియుచు నిందింప యాస్కఋషి నిరుక్తనిఘంటువును జేసి సమర్థించుకొనవలసిన యవసరము గలవాఁడాయెను. గీర్వాణభాషకుఁగూడ వ్యాకరణము వ్రాయునవసరము ప్రాకృతభాష వ్యావహారికభాషగా నుండినప్పుడే గాని మునుపుగాఁ గాదు. ఏకొందఱి వ్యవహారములో నైన నున్నంగాని భాష గ్రాంథికత్వ మందదు. అప్పుడు గాని దానికి నియమములు గనిపెట్టుట వ్రాయుట సంభవింపవు. లోకములో నర్థము ప్రాప్తింపఁగాఁ దత్ప్రతీకారము నరయుటవలె గ్రాంథికభాషలో వ్యవహారబలము

చే మార్పులువచ్చుచుండఁ దత్ప్రతిక్రియ నరయుట యుండును గాని ముం
దుగాఁ గాదు. ఇప్పటి వ్యావహారికభాషకు (తెనుఁగుభాషకు) వెనుకటి
గ్రాంథికభాషతో (ఆంధ్రభాషతో) సంబంధము లేకుండ వ్యాకర
ణనియమములను వ్రాసికొనవచ్చును గాని యట్లు శాస్త్రమును బెంచి
చేయఁదగిన దేమో తెలియదు. శాస్త్రమున కుపయోగము సులభముగను
నిర్దుష్టముగను భాషనలవడఁ జేసికొనుటయే కాని యూరక ప్రయాసము
నకుఁ గాదు. దీనివిషయమై పతంజలిమహాముని "రక్షోహాగమలఘ్వ
సందేహాః ప్రయోజనమ్" మ్మని నుడివియే యున్నారు. ఈప్రయోజనములు
వేదమునకు సంబంధించినవియే కాని సందర్భమును బరిశీలించినచో నన్ని
గ్రాంథికములకు నుపయోగించు నని తెలియఁగలదు. గ్రాంథికమైన వేద
భాషకూడ నొకప్పుడు వ్యావహారికభాషయే యై తీరవలెఁ గాన దాని
తరువాతి దగు సంస్కృతభాష వ్యావహారికభాషగా నుండినప్పుడు
గ్రాంథికభాషాప్రయోగములను రక్షించుట మొదలగు నంశములు సార్థ
కమైనట్లు ప్రస్తుతవ్యావహారిక త్రిలింగభాషాకాలమునఁ గూడ గ్రాంథి
కాంధ్రభాషారక్షణాదికము సార్థకము కాకపోదు. భాష యని పేరు వచ్చు
టకు జనులవ్యవహారము కారణము గాన వైదికభాష కూడ నొకప్పుడు
వ్యావహారికభాషయే యని నిర్ధరింపఁబడినది.

మఱియు నీవ్యావహారికభాష ప్రస్తుత వ్యవహారములో నున్నం
దున నందలి ప్రయోగములు వానినియమములును మఱుఁగుపడుటను
వలనుపడదు. గ్రాంథికభాషాప్రయోగములును వానినియమములును గ్రం
థైకదృష్టములు గనుక మఱుఁగుపడుట కవకాశము చాలఁ గలదు.
కనుక గ్రాంథికభాషకు నియమప్రకాశన మెట్లవసరమో యట్లు వ్యావ
హారికభాష కవసరము గాదు. లాభము లేని పని కెవ్వఁడు ప్రయత్నింపఁ
డు గదా!

మఱియు నే భాషకైన వ్యాకరణప్రయోజనము నేకొంచెమునై
నఁ జూచి యుండి గదా వ్యాకరణశాస్త్రమును వానిని గనుఁగొన య
త్నించుట. ఎప్పటి కప్పు డుచ్చారణభేదముచే మార్పు చెందు నీవ్యావహా

రికభాషకు నియమములను వ్రాయసమకట్టుట యీభాషాభ్యాసకునకు నుపద్రవము చేయుటయె కాని సాయము చేయుట కాదు. ప్రయోగరక్షణాది ప్రయోజనములు వ్యావహారికభాషకు నుండనేరవు. మఱవఁబడిన దానిని గదా శాస్త్రకర్త జ్ఞాపకము చేయుట. అది వ్యవహారమునం దున్నభాషవిషయమై యెక్కుడు నవసరము కాదు. కనుక వ్యావహారికభాషకు వ్యాకరణనియమములను వ్రాయఁబూనుట వృథాప్రయాసకారణము. ఈహేతువుచేతఁ గవులు వేఱనియు శాస్త్రకర్తలు వేఱనియుఁ దలఁచి కవి తనయిష్టమువచ్చినట్లు గ్రాంథికవ్యావహారిక భాషాపదములను గలిపి యుపయోగించుకొనవచ్చును. "ప్రయోగైకశరణా వైయాకరణా" యను నభియుక్తోక్తి గలదు గదా. కనుక నాతని ప్రయోగము లెట్లున్నను వానిది దోషము కాదు. వాని నన్నింటిని మేనమామయస్థులవలె మొత్తముచేసి దాఁచి యుంచుకొనవలసిన "పూచీ" శాస్త్రకర్తది కాని కవి కేమియు లేదు-అని చెప్పుదుఁ గావలసినచో వ్యావహారికభాషకుఁ గూడ వ్యాకరణము వ్రాసికొనుఁ డని వ్యాకర్తలపై నా భారమును వేయుట యెంతటిహాస్యప్రసంగమో యెంతటి శుష్కవాదమో శిక్షితవిద్యు లూహించెదరు గాక! మఱియుఁ బైనిఁ జెప్పఁబడిన భారమును బండితులపైఁ వేయఁదలఁచిన వారియుద్దేశ్యము ప్రకారము పండితుఁడు కొఱవిచేఁ దలఁగోఁకికొనఁ దలఁచినవాఁ డని యెంచఁదగును. అందఱవలె నతఁడు నేదో యొకకథలపుస్తకము వ్రాసి యిహపరములయందు సుఖింపలేక శాస్త్రాభ్యాసమున కని కొన్నియేండ్లు భాషాభ్యసనమున కని కొన్నియేండ్లు శ్రమపడి చివరకుఁ బొందఁదగినఫల మేమియు లేక యిట్టి వారినిందల పాలగుట యేనా మఱేమయినఁ గలదా? అందు శాస్త్రము గనుఁగొనిన వానిది తప్పా? యభ్యసించినవానిది తప్పా? కనుక నీ వాదము గట్టిపెట్టి పెద్దవారిమతము ననుసరింతము.

మనుష్యసృష్టికిఁ బ్రారంభమున నొకప్రదేశమునందు నొకస్త్రీపురుషుల జత యైన నుండియుండును. ఆదంపతులు గాని వారిసంతతివారు గాని తమయభిప్రాయమును బరస్పరము బోధించుకొనుటకు నేదో యొక

శబ్దరూపసాధనమును (అఖండవాక్యమును) దప్పక యుపయోగించుకొని యుందురు. ఆసాధనములో నప్పుడు తెలియఁబడకపోయిన యవయవములను పేరఁబరఁగు శబ్దము లనేకము లుండి యుండును. ఆశబ్దములకుఁ గూడఁ గర్తృకర్మక్రియాత్వాది ధర్మములు స్వరూపభేదము గలిగియుఁ బ్రయోక్తలచేఁ దెలియఁబడకయే యుండును. పరస్పరము వారు పలుకు పదములు సాధారణముగా నొకతీరుననే యుండును. అనఁగా నప్పుడు కూడ నభిప్రాయబోధకశబ్దరూపసాధనమున నొక యర్థముగల యేయానుపూర్వికి నేయేవిశేషార్థములు గలుగవలె నని యుద్దేశించి వక్త ప్రయోగించుచున్నాఁడో యాయానుపూర్వికే యాయావిశేషార్థములే గలుగవలె నని యాశ్రోత కూడ వక్తయైన మఱియొకప్పుడు ప్రయోగించుచున్నాఁ డని తాత్పర్యము.

ఆసాధనము దుష్టమగుటకు నాతరువాతివారి కేటికిని నోరాడదు గదా! దానినే తప్పువారికి లోకమునఁ దప్పనరానిది యుండనే యుండదు. ఆసాధనముతో వ్యవహరించువారి కుటుంబము పెరిఁగినకొలఁది నాయభిప్రాయబోధకశబ్దరూపసాధనముకూడఁ బెరిఁగియే యుండును. అనఁగా వస్తువిశేషవాచకములే గాక యాయాపదములలో వర్ణలోపాదులు గలిగి పర్యాయాదిపదములు గా మాఱి భాష పెరుఁగు నని యర్థము; ఆసాధనసామగ్రిని సాంగోపాంగముగ విమర్శించువాఁడు బయలుదేఱుపటికి నందవయవావయవులభేదము దుర్వార్యము. ఆ కాలమందుఁ గూడ నేకొంచెముగానో జీవనోపాధి భేదమును బట్టియు నుపదేశశ్రద్ధాదులఁ బట్టియు శబ్దోచ్చారణసాధనావయవముల సౌష్ఠవమును బట్టియు నేకైకశబ్దోచ్చారణము నియమమైకూడ జనులలో నుత్తమమధ్యమాధమభేదము కలుగకమానదు. కలిగినభేదముక్రమముగా బలిసి యాశబ్దమునకు రూపాంతరము నాపాదింపకపోదు. అప్పుడది పర్యాయాదిపదములుగా నుండి వ్యవహరింపఁబడును. మఱియును, జాతిగ రూపము మాఱిపోయినచోను బూర్వప్రయోగములను దరువాతి సామాన్య మానవులు తెలిసికొనలేక పోయినచోను మొదటి

రూపమునకును రెండవరూపమునకును సాధారణనియమము కుదురక పోయినచోను నా రెండు రూపములకు రెండు భాష లని వ్యవహారము రాక మానదు. ఆవ్యవహారము మొదట గ్రాంథికవ్యావహారికత్వములతో మొదలిడి పోనుంబోను దృఢపడిపోవును. శిక్షితవిద్యులు వ్యవహరించుపదజాలము గ్రాంథికము కాన నందు నేకట్టుపాటును వారు గ్రహింపంగలిగిరో యదియే వ్యాకరణ మని చెప్పంబడును. అది యాభాషాసహజన్మము గాని దేశాంతరమునుండి దిగుమతి యైనది గాదు. కనుక మనుష్యులతో వ్యవహారము దానితో భాష యద్దానితో గ్రాంథికవ్యావహారికత్వములు వానితో వ్యాకరణము నిట్టివి సూదితో దారమువలె నొకదాని నొకటి వీడక కలసిమెలసి యున్నవే కాని భేద్యములును బరిహార్యములును గావు.

కనుక భాష ముందు పుట్టినదా? వ్యాకరణము ముందు పుట్టినదా? యను వ్యాకరణదూషణపరవికటప్రశ్నపరంపరలను వదలివేయుట సర్వరమణీయము. మఱియు నీగ్రాంథికవ్యావహారికత్వములు వ్యర్థధర్మము లని పట్టుదలతో నందు రేని యొకభాషాకుటుంబములోని వని చెప్పంబడు రెండుభాషలు మొదట నెట్లుండినవి? అవి యట్లు చీలిపోవుటకుం గారణము మొదటినుండి ప్రజలయుచ్చారణభేదము గాక మఱే మని చెప్పందగును. దీనికి భాషాంతరసంపర్కమే కారణ మని నిర్ధారణ యుండునా? ఎట్లు పలికినను బలికినవాని యుద్దేశ్యమును వినువాండు గ్రహింపంగలుగునా? అట్లు చేయంగలిగినచో నీప్రపంచములో నొకకుటుంబములోని వని చెప్పంబడు నన్నిభాష లెందుల కాకుటుంబములో సర్వసాధారణములు గావు? వేలువేలు పలుకుబడులతో నారబ్ధమగు భాషల నొకటిగాం జేయుట యెట్లు? కనుక నీగ్రాంథికవ్యావహారికత్వధర్మము లనివార్యపృథక్పథము లని యొప్పి యూరకుండుట మంచిది.

పండితులు పరస్పరవిజయేచ్ఛ గలిగి యుందురు గదా యని యంతట నసూయాపీడితు లగుదు రనునింద కర్హులుగారు. అది వారినుదుట నేవ్రాయంబడలేదు. ఎందైన సామర్థ్యము గల ప్రతిమానవుండును సామర్థ్యము గలప్రతిమానవునితో నాయంశము ప్రస్తావింపంబడినప్పుడు

తనశూరత్వమును వెల్లడింపకపోఁడు. అది న్యాయ్యముకూడ నగును. కనుకనే మహాకవి కాళిదాసుగారు "ఆపరితోషా ద్విదుషాం న సాధు మన్యే ప్రయోగవిజ్ఞాన" మ్మనియు "తం సంతః శ్రోతు మర్హంతి సదసద్వ్యక్తిహేతవః" యనియుఁ బ్రశంసించి యున్నారు. పదవాక్యప్రమాణజ్ఞ భవభూతిమహాకవికూడ "ఉత్పత్స్యతే స్తి మమ కోపి సమానధర్మా" యని సవిచారముగనైనఁ బండితప్రశంస చేసియున్నాఁడు. "విద్వానేవ విజానాతి విద్వజ్జనపరిశ్రమ" మ్మను సదుక్తికూడఁ బండితుఁడు చేసిన కావ్యాదికమును బండితులకే యర్పింపవలె నని యుద్బోధించుచున్నది. "సమకాలురు మెచ్చ రెన్నఁడున్" అను చేమకూర వేంకటకవి దూషణపరవాక్యములు వ్యతిరేకముఖమునఁ బండితప్రశంసఁ జేయుట లేదా ? వీ రందఱుఁ బండితుల మెప్పును గోరియే కాదా వారి నుగ్గడించుట మొదలగునవి జరిగియున్నవి? కనుక పండితులు గ్రంథకర్తలనో రడంచుటకు వ్యాకరణ మను మహామోహనద్రవ్యమును దెచ్చిపెట్టి రని నిష్కారణముగ వారిని నిందింపక వారిపైఁ జిరాకు మాని పరాకులేక శాస్త్ర మభ్యసించి పరాల కైన యగు సత్కావ్యములను రచించి మిరాతి గులైన పండితశూరులకే కానుకగాఁ జేసినచోఁ జతురాననయువతి కంఠమున నిస్తులముక్తాకలాపసమర్పణ మగు నని నాచిత్తసర్వస్వము.

అయిన, వ్యవహారదుష్టపదములు గ్రాంథికకవుల రచనలయందుఁ గూడఁ గానఁబడుచున్నను, గ్రాంథికవ్యావహారికభాషాభేద మట్లే యుండవలె నని మీయభిప్రాయమా ? యనినచో "శాస్త్ర ప్రయోగవచసో శ్శాస్త్రం బలవ దుచ్యతే, అనిష్పన్నే పదే తేన ప్రయోగాశ్రయణం హితమ్" అను ప్రామాణికవచనమునుబట్టి వ్యవహారదుష్టపదములు బహుపండితప్రయోగమధ్యమునఁ దఱచు మెలఁగనేని యవి యనివార్యగ్రాహ్యము లని వేఱుగఁ బునరుక్తి యవసరము లేదు, గావున, నాపదముల విషయమై వ్యాకరణము చాల దను మొదలుగాఁ గల తద్దూషణములు సంకుచితదృష్టిమూలకములు గాని, న్యాయములు గా వని విన్నవించుచున్నాను.

తిక్కన--భారతరచన.

—విద్వాన్. పిసుపాటి విశ్వేశ్వరశాస్త్రిగారు, పిఠాపురము.—

మనుమసిద్ధిమహీపాలుని రాజ్యచక్రమును దన యసమానమేధాశక్తిచే ననన్యభృతముగా నడపిన సామాదిచతురుపాయజ్ఞుఁ డగుమహామంత్రియు, వేదశాస్త్రాధ్యయనము చేసి తదుక్తకర్మాచరణమునందు మిక్కిలి యాసక్తి గలిగి స్వాహాస్వధాశబ్దద్వయసంస్కృతము లగుహవ్యకవ్యములచేత దేవతలను బితృదేవతలను దృప్తిపఱిచిన సోమయాజియు, నుభయభాషాకవిత్వంబున మిగులఁ జతురుఁడై యుభయకవిమిత్రుఁ డనఁ బేరుఁ గాంచిన మహాకవియుఁ, దాను కృతికర్త యయ్యు నితరకవులచేఁ గృతులందిన మహాత్యాగియు, నిరంతరస్మరణీయచరిత్రుండును, హరిహరాద్వైతభావనాపవిత్రీకృతహృదయుండును, నగుతిక్కనసోమయాజి నిర్వచనోత్తరరామాయణాదికృతులను రచించియుఁ దృప్తిలేక తాను సంసారసాగరమును దరించుటకును, భారతకథారసపానముచేత 'నాంధ్రావళి మోదముం బొరయుటకును' దనమనంబున ననువైన మార్గము నాలోచించి మహాభారతము విరాటపర్వము మొదలు పదునైదుపర్వము లాంధ్రీకరించెను.

మనకవిబ్రహ్మ తనయాంధ్రీకరణమునఁ గ్లుప్తీకరణవిపులీకరణముల సాహాయ్యమున గ్రంథ మంతయును నడపినాఁడు; మఱియుఁ గొన్నిచోట్ల నౌచిత్యమునే ప్రధానముగాఁ జేసికొని మూలమున నున్నదానిని దెనిఁగింపక విడుచుటయు, మూలమున లేనిదానిని గల్పించి పెంచుటయును జేసినాఁడు. ఇట్టిమార్పులు దక్షకవులెల్లరును జేయవలయు నని ధ్వనిమార్గప్రతిష్ఠాపనాచార్యుఁ డగు నానందవర్ధనుఁడు చెప్పెను చూడుఁడు.

"శ్లో. ఇతివృత్తవశాయాతాం త్యక్త్వా ననుగుణాం స్థితిమ్
ఉత్ప్రేక్ష్యోప్యంతరాభీష్టరసోచితకథోన్నయః.

ఈవ్యాసము శ్రీసూర్యరాయవిద్యానందపుస్తకభాండాగారమున జరిగిన తిక్కన వర్ధంతి సందర్భమునఁ జదువఁ బడినది.

ఇతివృత్తవశాయాతాం కథంచిత్ రసాననుగుణాం స్థితిం త్యక్త్వా పునః ఉత్ప్రేక్ష్యాపి అంతరా అభీష్టరసోచిత కథోన్నయో విధేయః యథా కాళిదాసప్రబంధేషు (శాకుంతలాదిషు) కవినా ప్రబంధ ముపని బధ్నతా సర్వాత్మనా రసపరతంత్రేణ భవితవ్యం. తత్రేతివృత్తే యది రసాననుగుణాం స్థితిం పశ్యే త్తాం భఙ్క్త్వాపి స్వతంత్రతయా రసానుగుణం కథాంతర ముత్పాదయేత్.

శ్లో. అనౌచిత్యా దృతే నాన్య ద్రసభంగస్య కారణమ్
ప్రసిద్ధౌచిత్యబంధస్తు రసస్యోపనిషత్పరా" (ధ్వన్యాలోకము.)

ఆలంకారికమార్గమును జక్కఁగాఁ బరిశీలించి యౌచిత్యానౌచిత్యములను గుర్తించి తిక్కన తనభారతమును దీర్చి దిద్దినాఁడు. ఈమహాకవి యేవిషయమును వర్ణించినను బాఠకులను దన్మయులఁ జేయునట్లుగా వర్ణింపఁగలఁడు. దీనికి ముఖ్యోదాహరణములు:—అభిమన్యునియుద్ధఘట్టము, కృష్ణునిరాయబారపుఘట్టము. ఇట్టిఘట్టము లింకననేకములుగలవు. ఈఘట్టములు చదువునప్పు డీగ్రంథమున కొకమూలగ్రంథము కలద నియును దానికిది యాంధ్రీకరణ మనియు నెట్టివిద్వాంసునకేని తోఁపదు. అచ్చముగా నాంధ్రముననే (అనఁగా సంస్కృతమున లేకయే) తొలుత నీ గ్రంథము రచింపఁబడిన దనుదృఢవిశ్వాసము పాఠకులకుఁ గలుగునట్లు రచించినతిక్కనకవి మహాప్రతిభకు నమస్కరింపని యాంధ్రకవి యుండఁడు; కావుననే కవిత్రయములోనివాఁడగు నెఱ్ఱనార్యుఁడు తనహరివంశమునఁ దిక్కనను గవిబ్రహ్మ యని నుతించినాఁడు.

మ. తనకావించినసృష్టి తక్కొరులచేతం గాదునా నేముఖం
బునఁ దాఁ బల్కినఁ బల్కు లాగమములై పొల్పొందునా వాణి న
త్తను నీతం డొకరుండ నాఁ జను మహత్త్వప్రాప్తిఁ గవిబ్రహ్మనా
వినుతింతుం గవితిక్కయజ్వ నఖిలోర్వీదేవతాభ్యర్చితున్.

మనతిక్కనకు సాక్షాచ్ఛిష్యుఁడును మార్కండేయపురాణము నాంధ్రీకరించినవాఁడును నగుమారయ యాతనిగూర్చి యిట్లుచెప్పినాఁడు.

చ. ఉభయకవిత్వతత్త్వవిభవోజ్జ్వలు సంవిహితాధ్వరక్రియా
ప్రభు బుధబంధు భూరిగుణబంధురు భారతసంహితాకథా
విభుఁ బరతత్త్వబోధను నవీనపరాశరసూను సంతత
త్రిభువనకీర్తనీయయశుఁ దిక్కకవీంద్రుని గొల్తునర్థితోన్.

ఇందలి 'నవీనపరాశరసూను' 'ఉభయకవిత్వతత్త్వవిభవోజ్జ్వలు' అను విశేషణములు నాఁడు తిక్కనయందు వారికిఁ గలగౌరవమునకు సూచకములు. ఇంకను తిక్కనను గూర్చి విశేషములు తెలిసికొనుటకు దశకుమారచరిత్రమొకఁ డాధారముకలదు. దీనిని కేతన తిక్కనకుఁ గృతియిచ్చినాఁడు. ఇందుఁ దిక్కనవంశము వర్ణింపఁబడినది. ఈవిధముగాఁ (అనఁగాఁ గృతిద్వారమున) దనవంశమును దాను వర్ణించుకొనవక్కఱ లేకయే యితరులచే వర్ణింపఁజేసికొనిన తిక్కన వివేక మెట్టిదో యాలోచింపుఁడు. ఇఁకఁ గేతన తిక్కనను గూర్చి చెప్పినదానిని గొంచెము పరికించినచో నాతనిప్రవర్తనమును బ్రతిభాపాండిత్యములును స్పష్టముగాఁ దెలియఁగలవు. చూఁడుఁడు.

సీ. సుకవీంద్రబృందరక్షకుఁ డెవ్వఁ డనిన వీఁ
డనునాలుకకుఁ దొడవైనవాఁడు,
చిత్తనిత్యస్థితశివుఁ డెవ్వఁ డనిన వీఁ
డనుశబ్దమున కర్థమైనవాఁడు,
దశదిశావిశ్రాంతయశుఁ డెవ్వఁ డనిన వీఁ
డనిచెప్పుటకుఁ బాత్రమైనవాఁడు,
సకలవిద్యాకళాచణుఁ డెవ్వఁ డనిన వీఁ
డనిచూపుటకు గుఱియైనవాఁడు,
మనుమసిద్ధిమహీశ సమస్తరాజ్య
భారధౌరేయుఁ డభిమానభావభవుఁడు
కొట్టరువుకొమ్మనామాత్యు కూర్మిసుతుఁడు
దీనజనతానిధానంబు తిక్కశౌరి.

క. అభినుతుఁడు మనుమభూవిభు
సభఁ దెనుఁగున సంస్కృతమునఁ జతురుండై తా

నుభయకవిమిత్రనామము
త్రిభువనముల నెగడ మంత్రితిక్కఁ డాల్చెఁ.

సీ. సరసకవీంద్రుల సత్ప్రబంధము లొప్పఁ
గొను నను టధికకీర్తనకుఁ దెరువు
లలితనానాకావ్యములు చెప్పు నుభయభా
షలయందు ననుట ప్రశంసత్రోవ
యర్థిమైఁ బెక్కూళ్ళ నగ్రహారంబులు
గా నిచ్చు ననుట పొగడ్తపొలము
మహిత దక్షిణలైన బహువిధయాగంబు
లొనరించు ననుట వర్ణనముచొప్పు
పరుని కొకనికి నిన్నియుఁ బ్రకటవృత్తి
నిజము లై పెంపుసొంపారి నెగడు నెట్టుఁ
గొమ్మనామాత్య తిక్కని కొలఁది సదివుఁ
డింక నొక్కరుఁ డెన్నంగ నెందుఁ గలఁడు.

క. చతురానన సన్నిభునకు
సతతస్వాహాస్వధాదిశబ్దస్వభుసం
స్తృతహవ్యకవ్యసంత
ర్పితమఖశిఖముఖనిలింపపితృవర్గునకున్.

ఇఁకఁ దిక్కనకవి సంక్షిప్తీకరించిన చోటులును విపులీకరించిన తావులును, ఔచితీసంపాదనకై యన్యమార్గముల నవలంబించినపట్టులును సంక్షిప్తముగాఁ జూపుచున్నాను.

—సంక్షిప్తీకరణమునకు—

కవిబ్రహ్మ రసము చెడకుండుటకును గథ పాఠకులకు విసుగుపుట్టింపక వేగముగా నడచుటకును గొన్నిచోట్ల మూలములోని విషయములను సంక్షిప్తీకరించినాఁడు. అయినను దనకృతహస్తతను గొంత కనఁబఱిచినాఁడు. చూడుఁడు.—భార-ఉద్యో-3-౧౨౭.

చ. కొడుకులకంటె నయ్యనుఁగుఁగోడలి యెక్కుడు కూర్తుఁ గోడలుం
గొడుకులు సేయుభక్తి కటఁగోటిమడుంగులు భక్తి నాకు నె
ప్పుడుఁ దగఁజేయుచుండు నది పుణ్యచరిత్ర కులాగ్రగణ్య క్రొ
త్తడి సకలంబుఁ జూడ సభ దైన్యముఁ బొందుట సూచి ప్రాక్కితిన్.

ఈపద్యమునకు మూలమును గూడ నిటఁ జూపుచున్నాను.

"సర్వైః పుత్రైః ప్రియతరా ద్రౌపదీ మే జనార్దన. సం. భార. ఉద్యో ౯౦ అధ్యా. ౪౩."

ఈవిషయమునే తిక్కనకవి చతురముగాఁ "కొడుకులకంటె... చేయుచుండు." నను పలుకుఁ బెంచివ్రాసినాఁడు.

శ్లో. ...తథా వృత్తా... సం. భార. ఉద్యో. ౯౦ అధ్యా ౪౮.

(తథావృత్తా=పుణ్యశీలా. నీలకంఠ వ్యాఖ్య.)

ఇది "పుణ్యచరిత్ర" అనుదానికి మూలము.

శ్లో. కులీనా... ... ,, ,, ,, ౪౩.

శ్లో. మహాభిజనసంపన్నా... ,, ,, ,, ౪౫.

ఇవి "కులాగ్రగణ్య" యను దానికి మూలములు.

శ్లో. పతిభిః పంచభి శ్శూరై రగ్నికల్పైః ప్రహారిభిః,
ఉపపన్నా మహేష్వాసైః... ... ౪౬.

ఇందలిభావమునే "సభర్తృక" యనునర్థము గల "క్రొత్తడి" యను పదముచేఁ బ్రకటించినాఁడు.

శ్లో. సర్వైర్గుప్త కురవః ...౫౧

ఇది "సకలంబుఁ జూడ" నను దానికి మూలము.

శ్లో. తన్మాం దహతి యత్కృష్ణా, సభాయాం కురుసన్నిధౌ, ధార్తరాష్ట్రైః పరిక్లిష్టా...౫౭.

ఇందలిభావమునే "సభ దైన్యముఁ బొందుట సూచి ప్రాక్కితిన్" అని చెప్పినాఁడు. ఈవిధముగా ననేక శ్లోకములలో వ్యాసమహర్షి చెప్పి నవిషయము నొక్కపద్యములోఁ దిక్కనమహాకవి సంగ్రహించినాఁడు.

— విపులీకరణమునకు. —

౧. సోమయాజికిఁ దనదేశాచారముల యందెక్కువ మక్కువ. అవు నైనచోట నవ్యాచారములను బ్రవేశపెట్టుచుండును. చూడుఁడు:—

శ్లో. ప్రతిగృహ్యచ తాం పార్థః పురస్కృత్య జనార్దనమ్
    వివాహం కారయామాస సౌభద్రస్య మహాత్మనః
శ్లో. కృతే వివాహేతు తదా ధర్మపుత్రో యుధిష్ఠిరః
    బ్రాహ్మణేభ్యో దదౌ విత్తం యదుపాహరదచ్యుతః.

అని క్లుప్తముగా వ్యాసుఁడు చెప్పిన వివాహగాథను దనదేశాచారముల నందుఁ జొప్పించుటకును బాఠకులకు రసాంతరానుభవముచేఁ గొంత యుత్సాహమును గలిగించుటకును విస్తరించి వర్ణించినాఁడు. అందలి తలఁబ్రాలుపోసికొనుట మున్నగునవి యాంధ్రాచారములే. ఇట్లే భీముఁడు విరాటునియొద్ద మల్లులతోఁ 'గుస్తీపట్టు' పట్టునపుడును సంస్కృతమున లేకున్నను దనకాలమున నాంధ్రదేశమునఁ బ్రసిద్ధములై యున్న 'కుస్తీపట్లు'నే యెంతయో రమ్యముగా వర్ణించినాఁడు.

౨. శ్లో. క్లేశితశ్చ వనే సూరో వాసవేన చ శిక్షితః
    అమర్షవశ మాపన్నో యోత్స్యతే నాఽత్రసంశయః.
    సం. భార. విరా. ౮౦ అ ౨౮.

శా. సింగం బాఁకటితో గుహాంతరమునం జేడ్పాటుమై నుండి మా
    తంగస్ఫూర్జితయూథదర్శనసముద్యత్క్రోధమై వచ్చునో
    జం గాంతారనివాసఖిన్నమతి నస్మత్సేనపై వీఁడె వ
    చ్చెం గుంతీసుతమధ్యముండు సమరస్థేమాభిరామాకృతిన్.
    భార. విరా ౪-౯౫.

ఇక్కడఁ జక్కని యుపమానమును గల్పించి శ్లోకమునందలి భావమున కెట్టిశోభను గలిగించినాఁడో చూచితిరా!

—అన్యమార్గావలంబనమునకు—

"క్లేశితశ్చవనే" ఇత్యాది శ్లోకమునకు వెనుక

శ్లో. ఏషపార్థోహివిక్రాంతో... నాజిత్వావినివర్తేత సర్వాఃసిమరుద్గణాన్.

సం. భార. విరా. ౪౦ అధ్యా. ౧౫ మొదలు ౨౭ వఱకుఁ గల కఠినశ్లోకముల నొక్కఁడు దిక్కన తెనిఁగింపలేదు. ఏలయన నీశ్లోకములలోని భావమునే మరలఁ గర్ణుఁడు నిందించు కృపాచార్యునిచే శ్లో. ఏకో హి శత్రూన్ సమరే సమర్థః ప్రతిబాధితుం,—తథా నివాతకవచాః కాలకేయాశ్చ దానవాః, దైవతై రప్యవధ్యా స్త ఏకేన యుధిపాతితాః.

అది క్లుప్తముగాఁ జెప్పించె నాఁడు వ్యాసమహర్షి. మనతిక్కన యుసమయమున గురువగు ద్రోణాచార్యునిచే నర్జును నంతగా నుతింపఁజేయుటకన్నఁ గర్ణుని గర్వోక్తులకుఁ గ్రుద్ధుఁడైన కృపునిచేతనే యర్జునస్తుతి చేయించుట యుచితముగా నుండు ననియును, ద్రోణుని చేతను కృపుని చేతను గూడ నొక్కమాఱుగానే పైవిధముగా నర్జునస్తుతి చేయించుట సరసము గాదనియును దలఁచి యీవిధముగాఁ గృపునిచేతనే యర్జునస్తుతి చేయించినాఁడు.

వ. అక్కిరీటి యొక్కరుండ కాఁడే యని తలంతు మేని—

సీ. శక్రాది సురులతో సంగ్రామ మొనరించి
ఖాండవం బేర్చె నొక్కరుఁడ కాఁడె
యాదవబలమెల్ల నాఁగి ద్రోచి సుభద్రఁ
గడిమిమైఁ దెచ్చె నొక్కరుఁడ కాఁడె
దిగ్విజయంబునఁ దేజంబు సేసె ని
కురువంశమునకు నొక్కరుఁడ కాఁడె
బలముతో గంధర్వపతి నోర్చి విడిపించెఁ
గౌరవేశ్వరుని నొక్కరుఁడ కాఁడె
యని నివాతకవచులను దానవుల నాతఁ
డొక్కరుఁడ కాఁడె యుక్కుమడఁచె
నమరులకు నజేయు లగు కాలకేయుల
నొక్కరుండ కాఁడె యొరసెఁ గర్ణ! భార. విరా. ౪-౨౧౦.

మఱియును దిక్కన భావోద్రేకమును వర్ణించునప్పు డొకవిధ మగు నూతనశక్తి నాశ్రయించి యెంతయో రమ్యముగా వర్ణించును.

గీ. దిక్కజకతి నీకు నిచ్చిన తీవ్రశక్తి
చేతఁ గవ్వడి వడఁ జని చూతు వేని
వాసుదేవునిచే నది వ్యర్థమయ్యెఁ
దునియ లయ్యెను బొడిచియు ద్వారగభరణి. ఉద్యో. ౨-౨౭౨.

గీ. పాండవులకుఁ దగినపాలు మేదినిఁ బంచి
యిచ్చుకంటెఁ గార్య మెద్ది గలదు
ధర్మ మెద్ది సముచితం బగువిధ మెద్ది
శక్య మెద్ది చెప్పుఁడ వాక్యవిదులు. ఉద్యో. 3-౨౭౫.

క. నిండెసమయాబ్ధములు నిం
డొండన లేదిపుడ చని సుయోధనుతో భీ
ష్ముండును గురుఁడును వినఁగా
నిండె ననుము నిండె నిండె నిక్కంబునకున్. విరా. ౪-౩౭౦.

ఈవిధముగాఁ దనభారతరచనయం దనన్యసామాన్యప్రతిభను బ్రకటించి కృతార్థుఁడైనాఁడు. అట్టికవిబ్రహ్మను గనుటచే నాంధ్రదేశమాతయు గృతార్థురాలైనది.

శా. మూలం బొక్కఁడు దీనికిం గలుగునే మూలంబు తాఁజూడకే
వైళం బీకృతి తిక్కయజ్వ కవితావాల్లభ్యమేపార నా
నాలంకారరసౌచితీయుతముగా నల్లెన్ జుమీ యంచు ధీ
శాలుల్గూడ నుతింప భారతము యజ్వా! కూర్చి మాకిచ్చవే!

ఉ. నీమహిమం బచింత్యము, గణింప నశక్యము నీకవిత్వశో
భామహిమం బనన్యసులభం బగుఁ దావకపాత్రపోషణా
శ్రీమహిమం బుదాత్తము వచింపఁగ నీకునయప్రశస్తి ని
ర్ణోమహిమాకరా! తెలుపు మోపినభంగి ననుగ్రహింపవే.

గ్రంథస్వీకారము.

గృహలక్ష్మి.

దసరాసంచిక:—చెన్నపురమున స్త్రీలజ్ఞానాభివృద్ధికై డాక్టరు కే. యన్. కేసరిగారిచేతఁ బ్రకటింపఁబడుచున్న గృహలక్ష్మి మాసపత్రికకుఁ బ్రతిసంవత్సరమువలెనే యీసంవత్సరమును దసరాసంచికను బ్రకటించిరి. సంచికయంతయు సతీలలామలచేతనే వ్రాయఁబడిన వివిధవిషయ వ్యాసములతో నిండియున్నది. స్త్రీలు వ్రాసికొన్నవియే గనుక విషయము లన్నియు స్త్రీలయభివృద్ధినిగూర్చినవే యని వేఱుగఁజెప్ప నక్కఱ యుండదు. ఇట్టిపత్రికను బ్రకటించుచున్న శ్రీడాక్టరుగారి నభినందించుచున్నారము. కాని, జ్ఞానాభివృద్ధి నందుచున్న నారీమణు లందఱును మాతృభావనుగూర్చి యశ్రద్ధ చేయుచున్నా రని వగచుచున్నారము.

ఆంధ్రభూమి.

ఇది చెన్నపురములో శ్రీయుతులు ఆండ్ర శేషగిరిరావుపంతులు బి. ఏ. గారిచే నడపఁబడుచున్న దేశోపకారకమాసపత్రిక. ఈ 1938వ సంవత్సరము సెప్టెంబరునెల పత్రిక యంతయు (౭ సంపుటము-బహుధాన్య, భాద్రపదము ౨ సంచిక) "మదరాసుసంచిక" యనునామముతో వెలువడినది. విషయము లన్నియు మదరాసునుగూర్చినవియే.

"మదరాసు మహానగరము మన్నాటికి మనది. దానికిఁ జెన్నపురి యనుపేరు మనమిచ్చినది... మద్రాసు లేనియాంధ్రరాష్ట్రము తలలేని మొండెము, మద్రాసు అనునిరుసుమీఁద ఆంధ్రుల భవిష్యచ్చక్రము దిరుగనున్నది. మద్రాసు మనరాష్ట్రములోనుండి పోయినయెడల మననిధులుపోవును." ఈరీతిగా మద్రాసు మనయాంధ్రరాష్ట్రమునకు ముఖ్యనగరము కావలెనని చెప్పు వ్యాసము లనేకములు గలవు. మొదటినుండియు నాంధ్రులవలననే మద్రాసునగర మభివృద్ధిలోనికి వచ్చిన దనియును

తెల్పఁబడుచున్నది. అనేకులు చరిత్రములను బరిశీలించి యతినిపుణముగను యుక్తియుక్తముగను వ్యాసములను లిఖించియున్నారు. చాలసంతోషము. కాని ఆంధ్రదేశమునకై, యాంధ్రభూమికై, యాంధ్రరాష్ట్రమునకై, భగీరథప్రయత్నములు చేయుచున్న యాంధ్రులందఱు నాంధ్రభాషనధోగతికిఁ దెచ్చుచున్నారు. ఆంధ్రభాషను నీరసస్థితికిఁ దెచ్చుచున్నప్పుడాంధ్రభూమి యేయనంతాధారమునఁ గాలూనుకొనియుండునా, యని మాత్రము విచారముగా నున్నది.

కన్నడనుడి.

ఇది, బెంగుళూరులో నిరువదిమూఁడు వత్సరములక్రిందట స్థాపింపం బడిన కర్ణాటసాహిత్యపరిషత్తువారిచే, నూతనముగా వెలువరింపఁబడుచున్న వారపత్రిక. మొదటిసంపుటము, మొదటిసంచిక మాకందినది. కర్ణాటకభాషలో నాంధ్రభాషలోకంటె ననేక వారమాసపత్రికలు, కన్నడభాషాపోషకములు గలవు. తగినంత భాషాభిమానుల యాదరణము వానికిఁగలదు. కన్నడసాహిత్యపరిషత్తువారిపుడీ వారపత్రిలోఁ గూడఁ గేవల భాషావిషయములనే ప్రకటించుచున్నారు ఈపత్రికకు శ్రీ అ. న. కృష్ణరాయరుగారు సంపాదకులుగానున్నారు. ఈకర్ణాటసాహిత్యపరిషన్ముఖమున వెలువడు కన్నడనుడి దేశమున కంతకును జేఁదోడువాదోడుగా నుండుఁగాత! మహారాజాదరణమునందిన యీభాషకు నీ పత్రికలకుఁ గొఱంతయేమి!

మదవిదళనము.

ఇది యొక్క చిన్నపుస్తకము. చెన్నపురములో, ముత్యాలపేట హైస్కూలు ప్రధానాంధ్రోపాధ్యాయులు విద్వాన్ తా. అష్టగంపిళ్లెగారు రచించినది. (క్రౌను సైజు) ౬౩ పుటలుగలది. క్షేమేంద్రమహాకవి యొక్క దర్పదళనమను గ్రంథమును జదివి, యారీతిని దెనుఁగులో వచనరూపమున నొక్క కావ్యమును రచింపవలయు నని యుత్సాహపడి ప్రారంభించినది. ఇందు మదవిదళనవిషయములే పెక్కులు గలవు. మదము, అనఁగా గర్వ

ము—కూడదనిది దానివలన ననేకానర్థము లున్నవని చూపుటయే కవి కడంక, కావున, గర్వలక్షణము—కులమదము, దానినిరాసనము, ఇట్లే ధనమదము, దానిదళనము, విద్యామదము, దానివిదళనము, రూపమదము, దానివిదారణము, యౌవనమదము, తత్సదధ్వంసనము, అధికారమదము, తద్ధరణము, ఆచారమదము, తన్నిరాసము నని చిన్నిచిన్ని యుదాహరణములలో వివరించియున్నారు. భావజటిలము నిర్దుష్టము నై రాజిల్లుచున్నది.

ఇవ్విద్వాంసులు, "ఆంధ్రవాఙ్మయలక్షణదర్పణమును" వ్రాయుచున్నారు. అఱవములోని కంబరామాయణము నాంధ్రీకరించుచున్నారు.

ఈ మదవిదళనము వెల యెనిమిదణాలు.

సాంఖ్యాదర్శము.

శ్రీ ఉర్లాముజమీందారు లగు శ్రీ రాజా కందుకూరి బాలసూర్యప్రసాదబహదరుగారు చిరకాలమునుండి వ్రాయుచుకట్టిం యాంధ్రభాషానమను విజ్ఞానసర్వస్వమున కనుబంధము. సంఖ్యార్థనామప్రకాశికయను నది తొల్లియొక్కటి శ్రీ కనుపర్తి వేంకటరామ శ్రీ విద్యానందనాథవిరచితము కలదు. దానికంటె నిది విలక్షణమైనది. దానికి దీనికిని భేదమేమనన్- నిందు విషయవివరణముగలదు. అందుఁ గేవలపదములు మాత్రమే చెప్పఁబడినవి. ఉదాహరణము:—పన్నిద్దఱాళ్వారులు-వీరిలోఁ దొమ్మిదవవారాళ్వారు "తిరుమంగైయాళ్వారు (పరకాలయతి) వీరికి-కవిధ్వంసకులనియుఁ బేరుగలదు. కవిలోకదివాకరులనియు, చతుష్కవిశిఖామణులనియు, షట్ప్రబంధకవులనియు, కవివైరియనియు బిరుదనామములు కలవు. తిరునావిత్తిరునగరు అనుగ్రామమున కలియుగమున నాలువందల వత్సరములనాఁడు నీలుఁడను శూద్రునకుఁ జనించి ధనుర్విద్యనేర్చి చోళభూపతి కడ కొలువుండి (అయోనిజ యగు) కుముదవల్లిం గోరి దొంగిలించిన ధనముతో నామెం బడసినవారు. వృశ్చికమాస (కార్తికనెల). కృత్తిక వీరితిరునక్షత్రము. విష్ణుదేవుని శార్ఙ్గాంశసంభూతులు."

వాని వర్గులచేఁ దేర్తు వరుసతోడఁ
గడమయిరువదితో నిద్దక్కరములతుదఁ
గదిసి రేఫలు గలిగినఁ గలిగెఁ గాని
మఱి ఱకారంబు లే దెందు మారుతసుత. ౧౦

వ. ఇందు సంస్కృతపదంబులఁ దత్సమమగు తెనుఁగుపదంబులఁ రేఫలు గలవు ఱకారంబు లేకుండుట సుప్రసిద్ధం బగుఁ గ్రియాపదాంతాక్షరంబులపై రేఫవర్ణంబు లెట్టి వనిన. ౧౧

ఉదాహరణము:—

క. వ్రాసిరి వచ్చిరి చెప్పిరి
చేసిరి యన నాదిగాఁగఁ జెన్నగుక్రియలన్
డాసిన తెనుఁగులఁ గలయవి
భాసురముగ రేఫ లయ్యెఁ బవనతనూజా. ౧౨

గీ. రేఫక్రిందట ద్విత్వ మా రేఫ లేక
ఘనఱకారంబె ద్విత్వఱకార మగుచు
ఎఱ్ఱనను నల్పు నొకయిఱ్ఱి మఱ్ఱినీడ
నఱ్ఱగుఱ్ఱంబు గలవానికిఱ్ఱ వినుము. ౧౩

వ. ఇంక, అకారాదులపై వచ్చిన రేఫఱకారంబులకు వర్గక్రమంబున వివరించెద. ౧౪

సీ. అఱిగొనె నరదాన నరిగెను నరవాయి
గొన కిరు దరగంటఁ గనిరె నరయ
నఱసి చల్లారఁ గన్నార నారెకు నన
నారంగ ధర్మంబు నారఁగూరె
నారఁగాఁగినపాలు నారెకు లారాట
మారటం బారనిమ్రుగ్గి యారె
నారము నట్లు పొంగారె నారంగ న
ద్వయిమీఁద రేఫ లిర్వదియు రెండు

ఇరవు నిరువ్వరు నిరువది యిరుగెలఁకులు
నిరుము నిరవార నొల్లఁబోయి రవ నీరె
నీరికలుపుట్లె నీరేడు నీరెలుఁ గవఁ
బకనొకాంద్రేఫ లిద్వయియని హనుమ. ౧౫

సీ. అఱపఱ యఱకట యఱిముఱి యఱువది
యఱువుడు నఱుచు నక్కఱ యనంగ
నఱపొఱ దఱఫులు నఱచెయి పొల్పఱి
యఱచునె కఱయఱు లఱుము లనఁగ
నఱలేక యఱుగును నఱుకమ్ము టఱకాలు
నఱకొఱ లేక సిగ్గఱి యనంగ
గజ్జఱూకఱ యఱుఁగుడు కఱుబుసంబు బి
ట్టఱ యడలాఱ నొరాఱె నాఱు
రసము లాఱని తేజ మాఱాపు లాఱ
డి యన ముప్పదిరాలు నద్వయిని కఱికి
యఱులు నెఱుకట మెఱుసు క్రిక్కిఱియ నిఱిసె
నన నికారంబుపై ఱాలు నాఱుగుఁ గజ. ౧౬

సీ. ఉరపట యురఃణిం చఱిమెడి యురులఁద్రో
యుట డెంద ముఱియాడ నుఱియు ననఁగ
నుఱుళింట నూరక యుండుట నూరార్చు
టూరటపుచ్చుట యూరనుండి
యన నుద్వయంబుపై నొనరు రేఫలు పదు
నొం డివి కృతులలో దండిమెఱయు
నుఱుపుగ రిపులపై నఱుకుకు బలిముఱి
యఱుముచు నఱుకఱి నఱుకచేతు
లూఱడిల నూఱు ననఁగను నూఱుగడన
నూఱె నన నుద్వయంబుపై నుప్పతిల్లు
బండిఱా లివి పదియవ్వెఁ బరఁగఁ దెలుఁగుఁ
గృతులఁ గవులిఁకఁ బొలుపొందఁ గీశనాథ. ౧౭

సీ. ఎఱగలి కెరువడి మెఱగాఁగ నెఱయంగ
నెఱికె యేఱికెయున నెఱవిడు మన
నేమీఁదిరేఫ లివేఁడగు నోఁడోరు
లోరు లోరసిలఁగ మిన్నోరయ నోరిమె
నోరల కోరిచి తోరి యనఁగ రేఫ
లెన్నిది మోమీఁద నెసఁగె నింక
నెఱకలు నెఱచియు నెఱుకలు నెఱుకయు
నెఱసంజ మెఱుపును నెఱుఁగ లెఱుపు
మెఱుఁగుటనఁ దొమ్మి దేమీఁద నెనయు ఱాలు
ఱొఁఱువ దోఁఱవుల నోఁఱగాలు నోఁటిగె నవివ
నోఁఱపుగలకత్తి ఱొఱలోన నోఁఱలు టనఁగ
సప్తసంఖ్య తా లోమీఁద జరగుఁ గథవ. ౧౮

సీ. కారుక్రొమ్మొగులు తొల్కరిఁ గర మొప్పంగఁ
గురియఁ గసెన మొక్కరుఁడు చేసి
కోరకప్పంబు చేకూర నికరణి
కూర కారాకులు కూరుటయును
కరకరఁ గాలంగఁ గరఁగి కరువుఁబోసి
కోఁకి కూరిమి కోరఁజేసెఁ
కరవాలు కరువలి కారింప కూరుకు
కూరుతు కా రాటకా రనంగఁ
కూరనాటినమ్ము కోరప్రాణ మనఁ గారి
యంబును గరి గోరునది కరకరి
కారులు కెర లనఁ గకారాదిరేఫలు
ముప్పదియును రెండు ముఖ్యచరిత. ౧౯

సీ. కఱఁగట కొఱమాలి కొఱఁతవడి కఱుచ
కఱవుసఁ గొఱగాదు కొఱవి యనఁగఁ
గఱటిఁ దెల్పగరాదు కాఱియ కఱకఱ
కొఱలి కొఱలువచ్చెఁ గెఱయ ననఁగఁ

గఱికలు కఱుకొని కాఱుతె కొఱవంబు
కొఱగల్లు కఱువమాపు కొఱకుఱు యన

...   .

...   .

గలకకారాదిపెద్దఱకారసంఖ్య
యొనయ ముక్పదినాల్గయ్యె నిశజమంత్రి. ౨౦

సీ. గుఱువులుపాఱఁగ గఱుదాల్చె మేన్గోర
గఱువతనము గఱఁగిరి గుఱువుగ
గుఱుసులు గుఱుగు తెగిరికడి గిఱగిఱ
గుఱుసు సింగారము గఱగ గఱిత
గారాము ప్రగ్గిరి గఱిసెఁడి బంగారు
గుఱుగులు గఱువము గోఱ మనఁగ
నిరువదిరెండు రేఫ లివి గకారముమీఁద
గిఱుపుట గొఱియల గిఱిచి వగఱు
గుఱుతు గిఱుట గఱి గుఱి గొఱక గొఱిజ
గిఱుక గఱుగులు గుఱుగుఱు గుఱుకు గఱిసె
గఱులు దగ్గఱి గిఱుసెట్లు గుఱుక గిఱికొ
నె నన జాల్లిరువది గోపరిని యనిలజ. ౨౧

సీ. చేరువ తెచ్చిరి చెచ్చెర చేరిరి
చెఱుపు టచ్చెఱువును జోఱక యనఁగఁ
జోఱవ యచ్చెర లనఁ జూఱె యచ్చెరియము
చీఱమేన వచ్చిరి చెఱిపిరి యనఁ
జిఱుగని చెఱఁగులచీఁకలు నిల్చిరి
యన రేఫ లివి వదునెనిమి దయ్యెఁ
జిచ్చఱపిడుగును జిచ్చఱకును జోఱు
చిఱుకొట్లు చిఱుమి మచ్చిఱులేనఁబు
చూఱవిడుచుట క్రిచ్చఱ చూఱకుఱ యఁ
గఱులు చఱచుట చిఱుపులి గట్లచఱులు

చెఱలుటయు నేల చఱచుట చెఱనిడుటయుఁ
జెఱిసగము చుఱుపుచ్చుట చెఱిగొనుటయు. ౨౨

గీ. చెఱకువిల్లు చెఱపు సేయుట చెఱుచుట
చెఱువు చిఱునగవుచు జిఱుత యనఁగఁ
జాఱుకు ముట్టెవనఁగ క్షోణి నివ్వదియైన
చకర మైనఱాలు శంభుతనయ. ౨౩

వ. జకారానకు రేఫలు లేవు. ౨౪

గీ. జఱభి జెఱిపోతు జఱజఱ జాఱె ననఁగ
జఱిగొనియె జాఱుపుచ్చుట జిఱిజిఱి యన
జొఱజొఱ యనంగ ౫
తొమ్మిదివి జకారంబుపై దొడ్డఱాలు. ౨౫

సీ. తెఁచాడె తరమిడి తరువఁగాఁ దరచుట
తిరుగుట తిరియుట తిరము తెరువు
తెరలుట తరలఁగ తరఁగ తరతరము
నేర్తురు తోరమ్ము నెత్తురనఁగఁ
దెః తేర వత్తురు తేరా సుగంధంబు
తొరుగుట తరమించి తొరలిక యనఁ
దూరుపునాఁటను దేరంగ నేర్తురు
తీరనికిస్సఁ బల్ తెరఁగుకనులు
తెరలగాఁ గాఁచునెయ్యి కస్తురికి సమము
తేకుపైఁ జిత్తరువుబొమ్మ తారు గనిరి
తెరయఁ దోఁటతొరి వాంద్రరుడెంతు రనఁగఁ
దవర రేఫ లీక్షణమరుద్బాంధులు[1] హరి. ౨౬

సీ. తెఱలుట వాతెఱల్ తెఱదిరి యేడ్తెఱ
తెఱగుసగ్గుట యును దెఱవు లనఁగ

1. ఈక్షణమరుద్బంధులు=౩౨.

దఱుగుట తక్కువ తఱుగుట వెల్తియుఁ
దఱుగుట ఛేదనార్థంబు నయ్యె
దఱియగు సత్తఱిఁ దఱచగు తఱిగొని
తొఱగువడుటయును దఱఁగలింపఁ
దఱుముచుఁ దొఱఁగమిఁ దొఱగులువోవుచుఁ
దొఱగిన తావియుఁ దొఱఁగె ననఁగఁ
దఱగు తుఱుమును దిఱియును దాఱుటనఁగఁ
దూఱు తెఱచుచుఁ దఱలనఁ దేఱుకు రనఁ
దేఱికనుఁగొనఁ దఱులనఁ దేఱిమి యనఁ
దఱియఁ జొఱుమనఁ దీఱఁగఁ దఱికి ననఁగ. ౨౭

గీ. తెఱుఁగఁజేయుఁడు తొఱులను దఱఁగ దీర్ఘ
కన్ను తెఱచుట మఱి తెఱఁగన్న నంగఁ
దఱిమి యని నేసెఁ దెఱఁగొప్పఁ దఱిగొలు వనఁ
దపరములతోలు దృక్సముద్రము[1] లనిలజ. ౨౮

సీ. దురవరఁ జూదరి దొరలెల్లఁ గుకురుగ
దొరకోలు దరవాట దొరయఁ దరుట
దురపిల్లు టెకురుట దొరకొల్వు దొరకొంట
దూరులు దరిద్రొక్కి దొరసి రనఁగ
దరికొనె ననఁ బంచదశ రేఫ లవి యయ్యె
ముందఱ కాలంబు ముంద టెదురు
నం దొఱలించెద నాదఱ మిద్దఱ
మెందఱు వదఱుట కొంద ఱనఁగ
నెద్దితా యనంగఁ బెద్దఱికం బన
నందఱు నెన్నంగ నింద ఱనఁగ
బండితాలసంఖ్య పదుమూఁట నగు నెన్న
దపరమునను గల్గి తరుచరాఢ్య. ౨౯

1, దృక్సముద్రములు=౪౭.

ఈన్యాయము వేదాంతకల్పతరుపరిమళము ౧౭౭ పుటలోనున్నది.

౧४౧. ఉభయతః పాశా రజ్జుః.

రెండువైపుల బంధించు త్రాడు. అనఁగా నుద్వేగమునుగలిగించుస్థితి.

౧४౨. ఏకదేశవికృత మనన్యవత్.

ఒకభాగమందుఁ గలిగినవికారము వస్తువు నంతను మార్పనేరదు. ౧-౧-౫౭ అష్టాధ్యాయీ సూత్రముతో సంబంధించిన పదియవ వార్తికమునకు భాష్యములోఁ బతంజలి యిట్లువ్రాయుచున్నాఁడు. కుక్కకుఁ జెవులు గాని తోఁక గాని కోసివేసినచో నది గుఱ్ఱముగాఁ గాని గాడిద గాఁ గాని మాఱదు.

౧४3. ఏకసమ్బన్ధిదర్శనేఽన్యసమ్బన్ధిస్మరణమ్.

ఒకవస్తువును జూచినచో దానితో సంబంధించినవి జ్ఞప్తికివచ్చును. తర్కభాషావ్యాఖ్యాన మైనన్యాయప్రదీపము ४४ వ పుటలో "ధూమదర్శనమువలన దానితో సంబంధించిన యగ్ని స్మృతికి వచ్చును అని కలదు." "ఏకసమ్బన్ధిజ్ఞాన మపరసమ్బన్ధిస్మారకమ్".

౧४४. కపింజలన్యాయము.

కపింజల మనఁగా కౌంజుపిట్ట. వాజసనేయసంహితలో ౨४-౨౦ "వసన్తాయ కపిఞ్జలా నాలభేత"—ఇచ్చట నెన్ని పిట్టలనాలభనము చేయవలయు నని యొకసంశయము కలుగును. ఈవిషయమై జైమిని యెనిమిది సూత్రములను వ్రాసి చర్చించెను.

౧४౫. కమ్బలనిర్ణేజనన్యాయము.

గొంగళి నుతుకుట—గొంగళిని గాళ్లమీఁదఁ గొట్టి యుతికినచోఁ దాని మురికి పోవుటయే కాక కాళ్లమురికికూడఁ బోవును. ఒకపనిచేత రెండులాభములు కలుగుట. ఈన్యాయము శాబరభాష్యము ౨-౨-౨౫ సూత్రభాష్యములో నున్నది. "అపి చ దధి ఉభయ మసమర్థం కర్తుం ఫలం సాధయితుం హోమం చ నను కమ్బలనిర్ణేజనవ దేత ద్భవిష్యతి, నిర్ణేజనం హి ఉభయం కరోతి కమ్బలశుద్ధిం పాదయో శ్చ నిర్మలతామ్".

౧౪౬. కలంజన్యాయము.

కలంజ మనఁగా విషదిగ్ధబాణముచేఁ జంపఁబడిన మృగము యొక్క మాంస మని కొందఱందురు. మఱికొందఱు "బంగు" అందురు. ఈవస్తువు మాదకద్రవ్యము. గంజాయి. దీనికిఁ దామ్రచూడశబ్దము పర్యాయపదముగాఁ జెప్పఁబడియుండుటచేఁ బొగచెట్టని యర్థము. ఇందులకు జైమిని పూర్వమీమాంసలో ౬-౨-౧౯, ౨౦ సూత్రములలో నిట్టినిషిద్ధపదార్థములను సేవించుటవలనఁ గలుగుచెడుగులను జెప్పు నొకయధికరణ మున్నది.

౧౪౭. కాకాధికరణన్యాయము.

కాకి వాలిన యేదో యొకవస్తువు — ఈన్యాయము పతంజలి మహాభాష్యము ౧-౧-౨౬ వార్తికములు ౩-౪ లలో నున్నది.

దేవదత్తునియిల్లేదియని యొకఁ డడుగును. దానికి, అదిగో-కాకి వ్రాలిన యిల్లేయని యొకఁడు చెప్పును. తర్వాత నాయింటిమీఁదికాకి యెగిరిపోయినయెడల దేవదత్తునియిల్లు కావలసినవానికిఁ దెలియరాదు.

౧౪౮. కాచిన్నిషాదీ పుత్రం ప్రసూతే, కశ్చిన్నిషాదస్తు కషాయపాయీ.

కొండది పిల్లవానిని గన్నది. దానిభర్త కషాయమును ద్రాగుచున్నాఁడు. ఇది యొకనికిరోగము, మందుత్రాగుట మఱియొకఁడు — అను సామెతవంటిది. ఈన్యాయము "ముని శ్శృణుతే మూర్ఖో ముచ్యతే" అను న్యాయమువంటిది. ముని పరబ్రహ్మమును ధ్యానించుచున్నాఁడు, మూర్ఖుఁడు ముక్తినొందుచున్నాఁడని దీనియర్థము. ఈన్యాయము వేదాంతతత్త్వవివేకములో ౩౮వ పుటలో నున్నది. "ఏతే నైవ మహాస్త్రం ముని శ్శృణుతే మూర్ఖో ముచ్యతే, ఇత్యేతచ్ఛాస్త్రఫలం ప్రయోక్తృరీతిన్యాయవిరుద్ధం తథాచాభాణకః — కాచిన్నిషాదీ తనయం ప్రసూతే కశ్చిన్నిషాదస్తు కషాయపాయీతి మునికర్తృకశ్రవణాదివిధిఫలస్య సాక్షాత్కారస్య మూర్ఖేఽభ్యుపగమాత్. తత్ఫలస్యావిద్యానివృత్తేః మునిప్రత్యజ్మాత్రగతతయా మూర్ఖనిష్ఠత్వాభావాత్ దృష్టఫలానాం యథాదర్శన మూపపత్తేః.

౧౪౯. కూటకార్షాపణన్యాయము.

కూటకార్షాపణము=కృత్రిమమైననాణెము. ఇది కుమారిలభట్టుని తంత్రవార్తికము ౧-3-3 లో నున్నది. "శ్రుతిస్మృతులకు విరోధము సంభవించినపుడు శ్రుతి బలవత్తరము గావున స్మృతిని విడువవలయును. ఒక మనుష్యుఁడు కృత్రిమమైననాణెమును విడిచినట్లు "యోహికూటకార్షాపణం కంచిత్కాల మజ్ఞో లోకమధ్యే వ్యవహరతి న తేన వివేకజ్ఞానజనితప్రవృత్తినాపి తథైవ వ్యవహర్తవ్యమ్.

౧౫౦. కేవలైర్వచనైర్నిర్ధనాధమర్ణిక ఇవ సాధూన్ భ్రామయన్.

దరిద్రుఁడైనఋణికుఁ డప్పిచ్చినవారిని మాయమాటలచేఁ భ్రమింపఁ జేయును.

ఇది యాత్మతత్త్వవివేకము ౨౦ వ పుటలో నున్నది. "అవస్తుత్వాదితిచేన్న త్వేత దపి కుతః సిద్ధం సర్వసామర్థ్యవిరహా దితిచే త్సోయ మిత స్తతః కేవలైర్వచనైర్నిర్ధనాధమర్ణిక ఇవ సాధూన్ పరస్పరాశ్రయదోష మపి న పశ్యతి."

౧౫౧.* క్రియా హి వికల్ప్యతే న వస్తు.

క్రియ మార్పును జెందును గాని వస్తువు మార్పు నొందదు. ఈన్యాయము శంకరబ్రహ్మసూత్రభాష్యము—౧-౧-౨ లో నున్నది. "కర్తు మకర్తు మన్యథా వా కర్తుం శక్యం లౌకికం వైదికం చ కర్మ యథాశ్వేన గచ్ఛతి పద్భ్యా మన్యథా వా న వా గచ్ఛతి న తు వస్త్వేవం నైవ మస్తి నాస్తీతి వా వికల్ప్యతే.

౧౫౨. క్వోష్ట్రః క్వ చ నీరాజనా.

ఒంటెయెక్కడ నీరాజన మెక్కడ. శరత్కాలములో రాజులు యుద్ధయాత్రకుఁ బోవునపుడు తమసైన్యమం దుండు గజములకు నశ్వములకు నాయుధములకు మంగళహారతు లీయవలయునని శాస్త్రము—లొట్టియల కీయాచార మెచ్చటను జెప్పఁబడి యుండలేదు. "వాజినీరాజనా విధిః" అని రఘువంశకావ్యములో ౪-౨౫ శ్లోకమును జూడుఁడు. అనర్హునికిఁ బెద్దగౌరవముఁ జరుగుటవిషయములో నీన్యాయము ప్రవర్తించును.

౧౫౩. గర్గశతదండనన్యాయము.

గర్గగోత్రజులకు నూఱుమాపాయలు దండము విధించుట—"ప్రత్యేకం వాక్యపరిసమాప్తి, సముదాయే వాక్యపరిసమాప్తి'' అని వ్యాకరణ పరిభాషలు. ఈరెండును మహాభాష్యమందుఁ దఱచుగఁ గలిపి ప్రయోగింపఁబడును. "దేవదత్తయజ్ఞదత్తవిష్ణుమిత్రా భోజ్యన్తామ్" అని మొదటిపరిభాషకు, "గర్గా శ్శతం దణ్డ్యన్తామ్" అని రెండవపరిభాషకు మహాభాష్యకర్త యగుపతంజలి యుదాహరణముగా నిచ్చియున్నాఁడు. మొదటిదానిలో దేవదత్తయజ్ఞదత్తవిష్ణుమిత్రు లనువారికిఁ బ్రత్యేకముగా భోజనము పెట్టవలయును-ఇది ప్రత్యేకవాక్యపరిసమాప్తి. రెండవదానిలో గర్గవంశస్థులందఱుఁగలసి సముదాయముపైని దండ మిచ్చుకొనవలయును. ఇది సముదాయవాక్యపరిసమాప్తి.

౧౫౪. గర్తస్థమృతసర్పన్యాయము.

గోతిలోఁ జచ్చిపడియున్న పాము—ఇది విజ్ఞానభిక్షువు రచించిన బ్రహ్మసూత్రభాష్యము ౧-౧-౨ సూత్రవ్యాఖ్యానము ౩౬ వ పుటలో నున్నది. "ప్రాక్సృష్టేః ప్రళయా దూర్ధ్వం నాసీ త్కించి ద్ద్విజోత్తమ"-(నరసింహపురాణము) "నాసీ ఢితి విరతవ్యాపారతయా కారణరూపేణ గర్తస్థమృతసర్పవ ద్విలీన మాసీ దిత్యర్థః" ఆగ్రంథకర్తయే యాగ్రంథమందే మఱియొకచోట నిట్లు వ్రాయుచున్నాఁడు. "ఏవం సర్వత్ర తాంచ ప్రకృతిం గుణత్రయరూపిణీం నిత్యా మపి నిర్వ్యాపారతయా గర్భస్థమృతసర్పవత్సూరణకారణవివిక్తే చిన్మాత్రే విలాపయన్తి".

౧౫౫. గార్హపత్యన్యాయము.

ఇంద్రుని బరామర్శించు నొకమంత్రమును గార్హపత్యాగ్ని కన్వయింపఁజేయుట-పూర్వమీమాంసలో ౩-౨. ౩-౪ సూత్రములు "నివేశన స్సంగమనో వసూనాం" ఇ త్యైంద్ర్యా గార్హపత్య ముపతిష్ఠతే" అను మంత్రమును గుఱించి చర్చించుచున్నవి.

౧౫౬. గోదోహనన్యాయము.

గోదోహనము=పాలు పిదుకుపాత్ర—పశువృద్ధిని గోరు యజ

మానఁడు యజ్ఞములోఁ బాలపిడతతో నీళ్లు తేవలయు నని శాస్త్రమున్నది. ఈన్యాయము శంకరభాష్యము 3-3-౪౨ సూత్రవ్యాఖ్యానములో నున్నది.

౧౫౭. నహీశ్వరవ్యాహృతయః కదాచి త్పుష్ణన్తి లోకే విపరీత మర్థమ్. (కుమారసంభవము)

లోకమందుఁ బ్రభువులమాటలు విపరీతార్థమును దెలియఁజేయవు.

౧౫౮. వత్సక్షీరన్యాయము.

ఎట్లు దూడయొక్క యభివృద్ధికొఱ కచేతన మైనను క్షీరము ప్రవర్తించునో యట్లుగానే యచేతనమైనను బ్రకృతి పురుషునిముక్తికొఱకుఁ బ్రవర్తించును-"వత్సవివృద్ధినిమిత్తం క్షీరస్య యథా ప్రవృత్తి రజ్ఞస్యపురుషః మోక్షనిమిత్తం తథా ప్రవృత్తిః ప్రధానస్య" అని సాంఖ్యకారిక.

౧౫౯. నిర్వమర్శా హి భీరవః.

పిఱికివాండ్రు ముందువెనుకల నాలోచింపరు. ఇందులకుఁ గథాసరిత్సాగరములో లావణకలంబకమం దొకకథ కలదు. "పూర్వకాలమందు గంగాతీరమునఁ గామందిక యను నొకపట్టణ ముండెను. ఆపట్టణమందున్న వైరాగులమఠములో మౌనవ్రతి యగు నొకసన్న్యాసి నివసించుచుండెను. అతఁడొకనాఁడు భిక్షార్థ మొకకోమటియింటికిఁబోయి యచట రూపవతి యగువణిక్పుత్రికను జూచి కామాతురుఁడై "అహా! యేమికష్టము సంభవించినది" అని పెద్దకేక వేసి మఠమునకుఁ బోయెను. అంత నాకోమటి యామఠమునకుఁ బరుగిడి "అయ్యా స్వామీ! చిరకాలము నుండి మౌనవ్రతమును ధరించినమీరు మాయింటిలో నేఁ డావ్రతమును విడిచిపెట్టి పెద్దకేక వేయుటకుఁ గారణమే" మని యడిగెను. అందుల కాదుష్టసన్న్యాసి "కోమటీ-నీకొమార్తె వినాశసూచకము లయిన యనేక దుష్టసాముద్రికలక్షణములను గలిగియున్నది, కావున, నీకన్యకను నీయింటిలోనుంచుకొన్న యెడలఁ గొలఁదికాలములో నీవు నీకుటుంబజనము నీ యైశ్వర్యము నశించిపోవును. కాఁబట్టి నామాట విని యీరాత్రి యొక పెద్దమందసమును దెప్పించి దానిలో నీకన్యక నుంచి మందసముపై నొక

పెద్దదీపమునుంచి గంగానదీప్రవాహమందు విడిచిపెట్టుము. అని యుప
దేశించెను. పిఱికివాఁడగు నాకోమటి సన్న్యాసి చెప్పినట్లు చేసెను.

౧౬౦. పాత్రాపాత్రవిచార స్తు ధేనువన్నగయో రివ.

మనుష్యుఁడు దానముచేయునపుడు యోగ్యతాయోగ్యతలను బరిశీలింపవలయును. ఆవులకు గడ్డివేసినఁ దిని పాలిచ్చును. పాములు పాలు త్రాగి విషమునుమియును.

౧౬౧. గ్రావ్ణి రేఖేవ.

రాతిపైఁ జెక్కిన రేఖవలె—అనఁగా శాశ్వతముగా నుండునది.

"తన్మాం వ్రజకుమారాయ సంప్రదత్తాన్యథా తు మే
మరణం శరణం తాత గ్రావ్ణిరేఖేవ గీరియమ్.

౧౬౨. చందనన్యాయము.

చందనబిందువు శరీరమందొకచోట నుంచినచో దానిచలువ శరీరమంతటను వ్యాపించి చల్లగా నున్నట్లాత్మయు దేహమందొకచోట ననఁగా హృదయస్థానమందుండి జ్ఞానప్రకాశముచే శరీరమంతను వ్యాపించును. బాదరాయణసూత్రములు, ౨-౩;౨౩-౨౪ సూత్రములకు శంకరాచార్యులు వ్రాసినభాష్యమును జూడుఁడు.

౧౬౩. న హ్యేక మేవ సవిశేషం నిర్విశేషం చ భవతి.

ఈన్యాయ మద్వైతకౌస్తుభమందున్నది. "సత్యకామ స్సత్యసంకల్పః అస్థూల మనణ్వహ్రస్వమ్" అని యుభయవిధ మైన శ్రుతులు-బ్రహ్మము సవిశేష మనియు నిర్విశేష మనియుఁ జెప్పుచుండుటచే బ్రహ్మ యుభయలింగ మని చెప్పవచ్చును. అనిన బ్రహ్మ యుభయలింగము కాదు. ఏలయన నొక్కవస్తువునకు రెండురూపములు సంభవింపవు.

౧౬౪. అచిన్త్యాః ఖలు యే భావా న తాన్ తర్కేణ సాధయేత్.

జగజ్జన్మాదికము, జగదుపాదాననిమిత్తకారణములు, జగత్పరిమాణము, ధర్మాధర్మములు, మొదలగునవి చింతించుట కశక్యములు. వానిని దర్కముచేత సాధించుటకు శక్యముకాదు. తర్కాన్తరముచే నాతర్కము ఖండింపఁబడును.

౧౬౫. న హి కల్యాణకృత్కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి.

భగవద్గీత—౬-౪౦. శుభకరమైన పనిని జేయువాఁడు దుర్గతిని బొందఁడు. "అతికల్యాణరూపత్వాన్నిత్యం కల్యాణసంశ్రయాత్ స్మర్తౄణాం వరదత్వాచ్చ బ్రహ్మతన్మఙ్గళం కరమ్ । మఙ్గళానాం చ మాఙ్గళ్యం పవిత్రం మఙ్గళం కరమ్" ఇత్యాది వచనములచేఁ బరబ్రహ్మ మంగళస్వరూపుఁడని చెప్పఁబడుచున్నాఁడు. కావున నిచ్చట "కల్యాణకృత్" అనఁగా బ్రహ్మవేత్త యని యర్థము బ్రహ్మవేత్త కెన్నఁడు నమంగళములు రావు "న వాసుదేవభక్తానామశుభం విద్యతే క్వచిత్" అని సహస్రనామస్తోత్రము.

౧౬౬. న హి సార్వభౌమానన్ద మనుభవన్రాజా గ్రామాధిపతిసుఖం తుచ్ఛమపేక్షతే.

సార్వభౌమునియానందము ననుభవించుచున్న రాజు గ్రామాధిపత్యముఁ జేయుచున్నయొకనితుచ్ఛసుఖము నపేక్షింపఁడు.

౧౬౭. న హి స్వల్పో దోషోఽమితగుణాభిభావకః.

చిన్నదోషము గుణసమూహమును దిరస్కరింపలేదు. "ఏకో హి దోషో గుణసన్నిపాతే నిమజ్జతీన్దోః కిరణేష్వివాఙ్కః" కుమార.

౧౬౮. శామ్యేత్ప్రత్యపకారేణ నోపకారేణ దుర్జనః.

దుర్జనుఁడు కీడుచేసినచో వానికి మరలఁ గీడుచేసి వానిని శాంతిఁ బఁ జేయవలయునుగాని వానికుపకారము చేయఁ గూడదు.

౧౬౯. పిత్తం యది శర్కరయా శామ్యతి కోఽర్థః పటోలేన.

పంచదారచేతనే పైత్యము శాంతించినయెడల చేఁదుపొట్లకాయ చేత నేమి ప్రయోజనము?

౧౭౦. ఉత్ప్లుత్యాపి హి చణకః శక్తః కిం భ్రాష్ట్రకం భఙ్క్తుమ్.

వేఁగినసెనగగింజ పైకెగిరి తిరుగ నామూఁకుటిలోఁ బడినయెడల వానిని బగులఁగొట్టఁగలదా? ఏజనుఁ డుపకారము చేయుట కసమర్థుఁడై లజ్జలేక కోపగించునో వాఁడు వ్యర్థజన్ముఁడు.

౧౭౧. రాత్రౌ దీపశిఖాకాన్తిర్న భానావుదితే సతి.

దీపకాంతి రాత్రివేళనే గాని సూర్యోదయము కాఁగాఁ బ్రకాశింపదు. అట్లే గుణవత్తమునియెదుట నల్పగుణుఁడు ప్రకాశింపఁడు.

౧౭౨. కర్మణి వ్యజ్యతే ప్రజ్ఞా స్వస్థే కో వా న పణ్డితః.

పని వచ్చినపు డాపనిని నిర్వహించినవాఁడే ప్రజ్ఞావంతుఁడు. ఊరక యున్నపు డందఱుఁ బండితులే.

౧౭౩. మధు పశ్యసి దుర్బుద్ధే ప్రపాతం నానుపశ్యసి.

ఓరి వివేకహీనుఁడా, తేనెనే చూచుచున్నావు గాని ముం దున్నకోతిని జూడ కున్నావు. ఆనందబోధాచార్యులు తనన్యాయమాల లో నుదాహరించినాఁడు. దీనిపూర్వార్ధము "స్వాదుకాముక కామానాం వైతృష్ణ్యం కిం న గచ్ఛసి" అని. దేవీభాగవతమం దీశ్లోక మే యింకొక రీతిగా నున్నది.

"మధు పశ్యతి మూఢాత్మా ప్రపాతం నైవ పశ్యతి।
కరోతి నిన్దితం కర్మ నరకాన్న బిభేతి చ"—అని.

౧౭౪. మధ్యే అపవాదాః పూర్వా న్విధీ న్బాధన్తే నోత్తరాన్.

ఇది పరిభాషేందుశేఖరములోని యొకపరిభాష. నడుమనువచ్చిన యపవాదములు పూర్వవిధులనే కాని యుత్తరవిధులను బాధింపవు.

౧౭౫. మహార్ణవయుగచ్ఛిద్రకూర్మగ్రీవార్పణన్యాయము.

ఈవిచిత్రమైన న్యాయము "బోధిచర్యావతార మను గ్రంథము పకు శాంతిదేవుఁడు వ్రాసినవ్యాఖ్యానమందు పర్ణింపఁబడినది. మూల శ్లోకపూర్వార్ధ మి ట్లున్నది. "క్షణసమ్పదియం సుదుర్లభా ప్రతిలబ్ధా పురుషార్థసాధనీ" దీనివ్యాఖ్యాన మిది:—అష్టాక్షణవినిర్ముక్తస్య క్షణస్య సంపత్తిః సమగ్రతా ఇయం సుదుర్లభా సుష్ఠు దుఃఖేన లభ్యత ఇతి కథందిత్రాహ్య మహార్ణవయుగచ్ఛిద్రకూర్మగ్రీవార్పణోపమా". సముద్రములో నలుదెసలకుఁ దరంగవేగముచే నల్లాడుచున్న యొక్క రంధ్రమే గలకాఁడిలో నూఱుసంవత్సరముల కొకపర్యాయము నీటిపైకిఁ దేలు నొకగ్రుడ్డి తాఁబేలు మెడ దూర్చిన ట్లీలోకములో మనుష్యజన్మ లభించుట మిక్కిలి దుర్లభము.

౧౭౬. మహతాపి ప్రయత్నేన తమిస్రాయాం పరామృశన్।
కృష్ణశుక్లవివేకం హి న కశ్చి దధిగచ్ఛతి॥

చీఁకటిరాత్రియం దెంతప్రయత్నించిన నెవ్వఁడును దెలుపు నలుపు

విభాగమును జేయఁజాలఁడు. దీనిని దంత్రవార్తిక మనుగ్రంథమునందు ౧-౩-౧ కుమారిలభట్టాచార్యులు వాడుక చేసెను. మనువు, నితరస్మృతిశాస్త్రకర్తలుఁ దమధర్మముల నెచ్చటనుండి సంగ్రహించి వ్రాసినారో కనుఁగొనుట శక్యముకా దనుతత్త్వమును దెలియఁజేయుట కిది యుదాహరింపఁబడినది. ఈశ్లోకమునకు ముందుఁ గుమారిలభట్టు వ్రాయుచున్నాఁడు. "న చ త ద్విజ్ఞాయతే కిమ్పుశా ద్వాక్యా దిదం మన్వాదిభిః ప్రతిపన్నం, కిం విధిపరాత్ ఉత అర్థవాదరూపా దితి".

౧౭౭. మహతి దర్పణే మహా న్ముఖం, త దేవ కనీనికాయా మణు.

పెద్దయద్దమందుఁ బెద్దదిగాఁ గన్పడుముఖము కంటిపాపయం దల్పముగాఁ గాన్పించును ఈన్యాయము తాత్పర్యటీక యనుగ్రంథము ౧౩౭ పుటయం దున్నది. ఎట్లనఁగా "ఏక మపి వ్యంజకభేదాత్ ఉత్కర్షవన్నికర్షవ ద్దృష్టమ్ । యథా మహతి దర్పణే మహా న్ముఖం త దేవ కనీనికాయా మ ణ్వితి".

౧౭౮. మహిషీస్నేహప్రతిబద్ధభిక్షుదృష్టాంతము.

తొల్లి గృహస్థాశ్రమములో నున్నసమయమందుఁ దాను జూచి మోహించిన యొకవేశ్యయం దాసక్తి కలవాఁడై తురీయాశ్రమస్వీకారముఁ జేసినతర్వాతఁ గూడఁ దదభిలాషచేఁ జెడిన యొకసన్న్యాసిని యీన్యాయముచెప్పుచున్నది. ఇది పంచదశిలో ౯-౭౧ శ్లోకములోఁగలదు.

"అతీతే నాపి మహిషీస్నేహేన ప్రతిబన్ధతః
భిక్షు స్తత్త్వం న వే దేతి గాథాలోకే ప్రగీయతే.

౧౭౯. ముని ర్మనుతే మూర్ఖో ముచ్యతే.

ముని పరబ్రహ్మమును ధ్యానించును, మూర్ఖుఁడు ముక్తినొందును. దీని కాంధ్రభాషలో సరియైనలోకోక్తి "అన్నియుఁ దెలిసినవాని కమావాస్యమరణము, ఏమియుఁ దెలియనివాని కేకాదశిమరణము."

ఈన్యాయము వేదాంతతత్త్వవార్తికములో నున్నయొకవాక్యమం దుదాహరింపఁబడినది. "ఏతే నేవ మహాస్త్రం, ముని ర్మనుతే మూర్ఖో ముచ్యతే ఇ త్యేతచ్ఛాస్త్రఫలం ప్రయోక్తరీతి న్యాయవిరుద్ధం, తథా చ ఆభాణకః. "కాది న్నిపాపీ తనయం ప్రసూతే కశ్చి న్నిపావ స్త్ర కపా

యపా" యితి. మునికర్తృకశ్రవణాదివిధిఫలస్య సాక్షాత్కారస్య మూర్ఖే అనభ్యుపగమాత్.

౧౫౦. "య శ్చోభయో స్సమో దోషః న తే నైక శ్చోద్యో భవతి."

ఒకదోషమే రెండుపక్షములకు సంబంధించినపుడందులో నొక పక్షమే చోద్యము కాదు. ఈన్యాయము పతంజలి మహాభాష్యములో ౬-౧-౯ య శ్చోభయో ర్దోషో న త మేక శ్చోద్యో భవతి. ౫-౩-౧౫ లో శబరస్వామి కూడ నీన్యాయము నుదాహరించెను. అనిరుద్ధుఁడు సాంఖ్యసూత్రవృత్తి ౧-౬ లో నీశ్లోకమును వ్రాయుచున్నాఁడు:—

"య శ్చోభయో స్సమో దోషః పరిహారో ऽపి తాదృశః
నైకః పర్యనుయోక్తవ్యః తాదృగర్థవిచారణే."

౧౫౧. యస్య నాస్తి పుత్రో న తస్య పుత్రస్య క్రీడనకాని క్రియన్తే.

ఎవనికిఁ గుమారుఁడు లేఁడో వానిపుత్రున కాటవస్తువులు చేయఁబడవు. ౧౦-౩-౫ జైమినిసూత్రములకు శబరస్వామి వ్రాసినభాష్యమందు "న చ అఙ్గవిధి రసఙ్గే స్యాత్" అనుచోట "న హ్యసఙ్గే కర్మణి అఙ్గస్య విశేషః విధిః స్యాత్ భవతి చ విశేషవిధిః । అశ్వబాలః ప్రస్తర ఇతి । న హ్యసతి ప్రస్తరే ప్రస్తరవిశేషః శిష్యేత యథా యస్య నాస్తి పుత్రో న తస్య పుత్రస్య క్రీడనకాని క్రియన్తే" అని చెప్పఁబడినది.

౧౫౨. య స్యాజ్ఞానం భ్రమ స్తస్య భ్రాన్తం సమ్యక్ప్ వేత్తి సః.

జ్ఞానశూన్యుఁడు భ్రాంతికి లోపడి యున్నను జ్ఞానముకలవాఁడే యగుచున్నాఁడు. ఈన్యాయము సంక్షేపశారీరకవ్యాఖ్యానమం దున్నది. "నను మిథ్యాతత్త్వజ్ఞానయోః విషయవైషమ్యేపి య స్యాజ్ఞానం భ్రమ స్తస్య భ్రాన్తః సమ్యక్ప్ వేత్తి స ఇతి న్యాయాత్ అజ్ఞానభ్రాన్తితత్త్వబోధానాం ఏకాశ్రయత్వనియమాత్ అజ్ఞానాశ్రయచిన్మాత్రాశ్రయత్వ మేవ భ్రాన్త్యాదేః స్యాత్".

౧౫౩. రథకారన్యాయము.

వర్షకాలమందు రథకారుఁ డగ్న్యాధానము చేయవలెను. ఇపుడీ రథకారశబ్దమున కర్థ మేమి యని సంశయము. రథకారుఁ డనఁగా రథముఁ జేయువాఁడా లేక మాహిష్యకరణులకుఁ బుట్టినజాతివాఁ డనియా?

ఈప్రశ్నము ౬-౧-౪౪, ౫౦ లలో జైమినీయన్యాయమాలలో నిట్లు పరిష్కరింపఁబడినది. దానిలో సీవిషయ మిట్లు సంగ్రహింపఁబడెను. "ఆధానే శ్రూయతే వర్షాసు రథకార ఆదధీతేతి। తత్ర రథం కరోతీతి వ్యుత్పత్త్యా త్రైవర్ణికో రథకార ఇతి చేత్ నైవం సంకీర్ణజాతివిశేషే రూఢత్వాత్ వైశ్యాయాం క్షత్త్రియా దుత్పన్నో మాహిష్యః। శూద్రాయాం వైశ్యా దుత్పన్నా కరణీ। తస్యాం కరణ్యాం మాహిష్యా దుత్పన్నో రథకారః। తథా చ యాజ్ఞవల్క్యః। మాహిష్యేణ కరణ్యాం తు రథకారః ప్రజాయతే ఇతి."

౧౭౪. రాత్రిసత్రన్యాయము.

ఈన్యాయము జైమిని ౪-౩-౧౭, ౧౯ లలో విపులముగాఁ జెప్పఁబడెను. ఈరాత్రిసత్రమునకు విశేషఫలముఁ జెప్పలే దనియును నిది కేవల మర్థవాదవాక్య మనియు వేదాంతులు చెప్పుచున్నారు. రాత్రిసత్ర మనఁగా రాత్రి చేయు యజ్ఞము. శంకరాచార్యులు బ్రహ్మసూత్రభాష్యములో ౩-౩-౩౭ యీన్యాయమును జెప్పలేదు. కల్పతరుపరిమళకారుఁ డీన్యాయమును దన గ్రంథమందుఁ జెప్పెను.

౧౭౫. రాధావేధోపమాన్యాయము.

"పోలీసువాం" డ్రొకమేదరితడికపై నొకచుక్కను బెట్టి దూరము నుండి తుపాకులతోఁ గొట్టుదురు. గొప్పనేర్పుతోఁ జేయఁబడు నొకదుర్ఘట మైనపని. "రాధే" అనఁగాఁ బ్రాకృతభాషలో "పుత్తళియా" అని పేరు. అనఁగాఁ జిన్నబొమ్మ. ఇది యుకమితిభావప్రపంచవివరణమం దిట్లు వ్రాయఁబడినది.

"సాచేయతీ భవే త్తస్య సామగ్రీయం సుదుర్లభా
రాధావేధోపమానేన ధర్మప్రాప్తిః ప్రకీర్తితా
ఏవం సంసారవిస్తారం విలంఘ్య కథమ ప్యదః
మానుష్యం ప్రాప్య దుష్ప్రాపం రాధావేధోపమం జనః.

౧౭౬. రోహణాచలలాభే రత్నసమ్పద స్సమ్పన్నాః.

రోహణాద్రి యనఁగా రత్నములు లభించుకొండ-అట్టిపర్వతము మనకు లభించినపుడు రత్నసంపదలు లభించును. ఇది సర్వదర్శనసంగ్ర

హాములోఁ బ్రత్యభిజ్ఞాభాగమందుఁ జేర్పఁబడినది. "పరమేశ్వరతా లాభే హి సర్వాస్సమ్పద స్తన్నిష్యన్దమయ్యః సమ్పన్నా ఏవ రోహణాచలలాభే రత్నసమ్పద ఇవ.

౧౮౭. వటయక్షన్యాయము.

ప్రతిమఱ్ఱిచెట్టుపైని దయ్య ముండు నని లోకుల నమ్మకము. ఇది ఐతిహ్యప్రమాణములోనిది.

ఐతిహ్య మిహ వటే యక్షః ప్రతివస తీతి లోకప్రసిద్ధిః.

౧౮౮. విలూననాసికస్యాదర్శదర్శనమ్.

ముక్కు కోయఁబడినవాని కద్దముఁ గనఁబఱుచుట. అనఁగా—కోపము లేనివానికిఁ గోపమును బుట్టించుట యని యర్థము. ఈన్యాయము ప్రబంధచింతామణిలో ౩౯౧ వ పుటలో నున్నది.

"ప్రాయ స్సమ్ప్రతి కోపాయ సన్మార్గ స్యోపదేశనమ్
విలూననాసిక స్యేవ యద్వ దాదర్శదర్శనమ్.

౧౮౯. విషకుమ్భః పయోముఖమ్.

పైని పాలును లోపల విషముఁ గలకడవ. పైకిఁ దియ్యనిమాటలాడుచు లోపలఁ గపటము గలమిత్రునికిఁ జెల్లును. "A wolf in sheep's clothing" అని దీని కాంగ్లేయభాషలో సరియైన సామెత కలదు. (గొఱ్ఱెవేషము ను ధరించినతోఁడేలు) ఈన్యాయము ప్రబంధచింతామణిలో నిట్లుదాహరింపఁబడినది.

"పరోక్షే కార్యహన్తారం ప్రత్యక్షే ప్రియవాదినమ్
వర్జయే త్తాదృశం మిత్రం విషకుమ్భం పయోముఖమ్"

౧౯౦. కుమారీకఙ్కణన్యాయము.

ఒకకన్యకచేతికి గాజులు హెచ్చుగా నున్న యెడలఁ గలకలధ్వని పుట్టును. రెండేసి యున్న యెడలఁ బరస్పరసంఘర్షణము కలుగును. ఒక్కొకటి యున్న యెడల నిశ్శబ్దముగా నుండును. ఇట్లే కసన్న్యాసి పదిమందితోఁ గలిసి యున్న యెడల శ్రవణమననాదులను విడిచి తక్కినవారితోఁ గలహించుటయే సంభవించును. ఇద్ద ఱున్న యెడలఁ బరస్పరసంభాషణ

ము జరుగును. ఒక్కఁడుండుచో భగవన్నామస్మరణ మవిచ్ఛిన్నముగా జరుగును. ఇంకను క్రిందిగువ వ్రాసిన శ్లోకమును జూడుఁడు—

"ఉపలానాం కలహో నిత్యం ద్వాభ్యాం సంఘర్షణం తథా
ఏకాకీ విచరిష్యామి కుమారీకఙ్కణం యథా"

౯౧. మార్దవే దోషః.

లోకములో నొకమనుజుఁడు మృదుత్వ మవలంబించి యూరక యున్న యెడల నందఱు వానిని బాధించెదరు. "మృదుస్సర్వత్ర పరిభూయతే" అని న్యాయము. ఈయర్థమునే మాఘకవి శిశుపాలవధలో నీదిగువ వ్రాసిన శ్లోకమందు సంగ్రహించెను.

"తుల్యేఽపరాధే స్వర్భానుర్భానుమన్తం చిరేణ యత్
హిమాంశుమాశు గ్రసతే తన్మ్రదిమ్నః స్ఫుటం ఫలమ్"

౯౨. విషస్య విష మౌషధమ్.

విషమునకు విషమే యౌషధము. సర్పదష్టునికి విషమాత్ర ప్రయోగించిన విషము క్రుంగు నని వైద్యశాస్త్రప్రసిద్ధి. దుష్టుని వంచించుటకు దుష్టుఁడే కావలయు నని యన్యాపదేశార్థము.

౯౩. ఘటానాం నిర్మాతు స్త్రిభువనవిధాతుశ్చ కలహః.

సృష్టికర్త యగు బ్రహ్మకుఁ గుమ్మరివానికిఁ గలహము. నీవు (ఘటములను) సృజించెదవు.-అనఁగా మనుష్యులను సృజింతువు. నేను (ఘటములను) సృజించెదను అల్పుని కధికునితోఁ గలహము.

౯౪. యత్కార్యం జాయతే యస్మాత్ తస్మిన్ తత్ ప్రతితిష్ఠతి.

దేనివలన నేకార్యము పుట్టుచుండునో యది దానియం దున్నదని న్యాయవైశేషికసిద్ధాంతము—ఎట్లంటేని-మృత్తులో ఘటము, స్వర్ణమం దంగుళీయకము, తంతువులయందుఁ బటము నున్నవి.

"మృత్తికాయాం ఘటస్తన్తౌ పటస్స్వర్ణేఙ్గుళీయకమ్
ఇతి వైశేషికాః ప్రాహు స్తథా నైయాయికా అపి"

౯౫. అంధానంధన్యాయము.

గ్రుడ్డివాఁడు కన్నులు కలవాఁ డగుట-ఎట్లనఁగా-"అహం బ్రహ్మాస్మి" నేను బ్రహ్మనై యున్నా నను వాక్యమువలనఁ బుట్టినజ్ఞానముచే

యోగి యాత్మను జూచుచున్నాఁడు. అప్పు డాతఁ డనంతుఁ డాయె నని చెప్పవచ్చును. దీనికి శ్రుతిప్రమాణము కలదు.

"తం వా ఏతం సేతుం తీర్త్వా అన్ధ స్స న్ననన్ధో భవతి." ఇక్కడ సేతుశబ్దమునకుఁ బరబ్రహ్మ మర్థము.

౧౯౬. కుసూలధాన్యన్యాయము.

కొణక ధాన్యమున కాధార మై యున్నట్లు పరబ్రహ్మము సకలజగత్తుల కాధార మై యున్నాఁడు. దీనికిఁ బ్రమాణము "విష్టభ్యాహ మిదం సర్వ మేకాంశేన స్థితో జగత్" అనుగీతావాక్యము.

౧౯౭. సర్వారమ్భా హి దోషేణ ధూమే నాగ్ని రి వావృతాః.

లోకములో నన్నికార్యము లు ధూమముచే నగ్నివలెనే దోషముచేఁ గప్పఁబడి యుండును.

౧౯౮. గిరి ముత్పాట్య మూషికా ఉద్ధృతా.

కొండను ద్రవ్వి యెలుకను బట్టుట. బహుప్రయాససాధ్య మైనపని యం దల్పఫలలాభమును దెలియఁ జేయుట కీన్యాయము. ఈయర్థమునే యీ-డిగువశ్లోకమును జెప్పుచున్నది. "ఖన న్నాఖుబిలం సింహః పాషాణశకలాకులమ్ । ప్రాప్నోతి నఖభఙ్గం వా ఫలం వా మూషికో భవేత్.

౧౯౯. యదన్నః పురుషో భవతి తదన్నా స్తస్య దేవతాః.

లోకమందుఁ బురుషుఁ డేయన్నముం దినునో వాఁడు పూజించు దేవతలకుఁ గూడ దానినే నివేదించును. ఇందుల కుదాహరణముగాఁ బొల్లి విశ్వామిత్రుఁడు చండాలగృహమునుండి మాంసమును దీసికొనివచ్చి యింద్రాదిదేవతోద్దేశముగా నగ్నిలో వేల్చి భుజించెద నని సంకల్పించి యట్లొనర్పఁగాఁ దద్దేవతాతుష్టిచేఁ బ్రభూత మైనవర్షము కురిసెను. దేశమందు సస్యములు ఫలించెను.

౨౦౦. స్వస్థే చిత్తే బుద్ధయః సమ్భవన్తి.

మనస్సు స్వస్థముగా నుండఁగా బుద్ధి బాగుగాఁ బ్రకాశించును.

"చిన్తాక్రాన్తం ధాతుబద్ధం శరీరం నష్టే చిత్తే ధాతవో యాన్తి నాశం
తస్మాచ్చిత్తం సర్వతో రక్షణీయం స్వస్థే చిత్తే బుద్ధయ స్సమ్భవన్తి."

ఈశరీరము వాతపిత్తశ్లేష్మాది ధాతువులతోఁ గూడినది. ఇది చింతా

క్రాంతము కాఁగాఁ జిత్తము క్షీణించును. చిత్తనాశమువలన ధాతువులు క్షీణించును. కావున సర్వప్రకారములచేతను జిత్తము రక్షించుకోఁబడఁ దగినది.

౨౦౧. లపోరశంఖన్యాయము.

లపోర మనఁగా, నొకజాతిశంఖము. ఈశబ్దము 'లపవ్యక్తాయాం వాచి' (స్పష్టమైన పలుకని యర్థము.) అనుధాతువునకు "కిశోరాదయశ్చ" అనుసూత్రముచే 'ఓరక్' ప్రత్యయము వచ్చును. అందుపై స్వార్థమందుఁ 'గ' ప్రత్యయము. ఇది శ్లోకబద్ధమై యున్నది.

"శఙ్ఖినీకాఞ్చనం దద్యా దహం శఙ్ఖో లపోరకః,
దదామి బహువాక్యాని న దదామి కపర్దికామ్"

శంఖినియనఁగా గట్లతీఁగ. దానివల్ల ధనము సంపాదింపవచ్చును. లపోరక మనుపేరుఁ గలశంఖమునైన నేను బహువాక్యముల నుచ్చరింతును గాని గవ్వయైనను నావలన లాభములేదు.

౨౦౨. న సాహస మనారుహ్య నరో భద్రాణి పశ్యతి.

లోకములో మనుష్యుఁడు సాహసము నవలంబించినఁ గాని క్షేమమును బొందఁడు.

౨౦౩. ఆపద్యపి సతీవృత్తం కిం ముఞ్చన్తి కులస్త్రియః.

కులాంగన లాపదయందుఁగూడఁ బాతివ్రత్యమును వీడరు.

౨౦౪. పంచభిర్మిళితైః కిం యజ్జగతీహ న సాధ్యతే.

ఐదుగురు మనుష్యులైకమత్యము నొంది పాటుపడినచో నన్ని కార్యములు సాధింపఁబడును.

౨౦౫. కః ప్రాజ్ఞో వాఞ్ఛతి స్నేహం వేశ్యాసు సికతాసు చ.

ఏబుద్ధిమంతుఁడు వేశ్యలయందును నిసుకయందును స్నేహమును బొందఁగోరును ? ఇసుకలోఁ దైలమును దీయుట యెంతయసాధ్యమో వేశ్యయొక్క స్నేహమును సంపాదించుట యంతదుష్కరము. ఇచట స్నేహశబ్దమునకుఁ దైలము, మైత్రి యని రెండర్థములు.

౨౦౬. అతర్క్యా కుట్టనీకూటరచనా తు విధే రపి.

కుట్టని యనఁగాఁ దారుపుకత్తె—"కుట్టనీ శంభలీ సమే" అని యమరము. ఆకుట్టనియొక్క మాయోపన్నుగడలు బ్రహ్మదేవునకుఁగూడ నూహింప నలవిగానివి.

౨౦౭. వృక్షవృత్తిన్యాయము.

ప్రయత్నము లేకుండ లభించిన వస్తువులవలన జీవించుట. ఎట్లనఁగా—వృక్షము మేఘోదకముచేతను చంద్రకిరణములచేతను జీవించును. కుమారసంభవములోఁ గాళిదాసు కూడ దీనినే యుదాహరించెను.

"అయాచితోపస్థిత మమ్బు కేవలం రసాత్మకస్యోడుపతేశ్చ రశ్మయః
బభూవ తస్యాః కిల పారణావిధి ర్న వృక్షవృత్తివ్యతిరిక్తసాధనః."

౨౦౮. న్యగ్రోధబీజన్యాయము.

సూక్ష్మవస్తువైనను మంచిపాత్రముం బడి విస్తరించును. ఎట్లనఁగా—మఱ్ఱివిత్తు మిక్కిలి చిన్నదైనను సుక్షేత్రముం బడి మహావృక్షముగాఁ బెరుఁగును

౨౦౯. ఉద్దీప్తే భవనే చ కూపఖననం ప్రత్యుద్యమః కీదృశః.

ఇల్లు కాలుచుండఁగా నూయిఁ ద్రవ్వుటకుఁ బ్రయత్నముచేయుట.

అనఁగా—కార్యము నశించినతర్వాత దానిని బాగుచేయుటకుఁ బ్రయత్నించుట.

౨౧౦. హోతార మపి జుహ్వానం స్పృష్టో దహతి పావకః.

అగ్ని తనకు హవిరర్పణముచేయుచున్న హోతనుగూడ ముట్టుకొనిన యెడల దహించును. ఖలుఁడు లోకములోఁ దనకు మేలుచేయువానికిఁ గూడఁ గీడొనర్చును.

౨౧౧. చందనగుణన్యాయము.

చందనవృక్షము తనసమీపమం దున్నవృక్షములకుఁ గూడఁ దనపరిమళమును లభింపఁజేయును. ఈన్యాయమును భర్తృహరి యిట్లు వివరించెను.

"కిం తేన హేమగిరిణా రజతాద్రిణా వా యత్రాశ్రితాశ్చ తరవ స్తరవ స్తఏవ
మన్యామహే మలయమేవ నగాధిరాజంశాఖోటనింబకుటజాఅపిచన్దన స్తి"

బంగారపుకొండయైనమేరువుతోను, వెండికొండయైన కైలాసముతోను, నేమిలాభము? వానినాశ్రయించియున్న చెట్లెప్పటికి నేకరీతిగానే యుండును. మలయపర్వతమునే పర్వతశ్రేష్ఠ మని తలంచెదము. ఏలనఁగా—దాడిచెట్లు, వేఁపచెట్లు, అంకుడుచెట్లు మున్నగునవి కూడనా పర్వతమందుఁ జందనవృక్షము లగుచున్నవి.